


PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసేమ

జాతీయ తెలుగుదినపత్రిక





ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 24 | మంగళవారం 28, ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari


## విజయం కన్నా ఓటమే గొప్ప పాఠం నేర్పుతుంది

### -ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్



విశాఖ ఏప్రెల్ 27 : విజయం సాధిం చాలంటే ముందు మన అంతర్గత ఒత్తిడిని జయించాలని, అప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలమని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరిలో ఉండే అంతర్గత ఒత్తిడిని అధిగమించగలిగితేనే ఏ రంగంలోనైనా రాణించగలమని స్పష్టం చేశారు. విశాఖపట్నం లోని ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ) శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను ఉదాహరణగా చూపుతూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు."క్రికెట్ దేవుడిగా పిలిచే సచిన్ టెండూల్కర్ కూడా తన 100వ సెంచరీ చేయడానికి చాలా సమయం తీసుకున్నారు. ఆ సమయంలో ఆయన తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొన్నారు.కానీ, ఓపికతో, పట్టుదలతో ఆ ఒత్తిడిని జయించి తన లక్ష్యాన్ని సాధించారు. జీవితంలో గెలుపోటములు సహజం. నిజానికి విజయం కంటే ఓటములే మనకు ఎక్కువ గుణపాఠాలు నేర్పుతాయి. కాబట్టి ఓటమికి భయపడకుండా, మరింత ధైర్యంతో ముందుకు సాగాలి" అని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.ఆంధ్రా యూనివర్సిటీ వందేళ్ల చరిత్రను, దేశానికి అందించిన సేవలను ఉపరాష్ట్రపతి కొనియాడారు. ఈ విశ్వవిద్యాలయం

2 లో

## ఏపీలో పెట్రోల్, డీజిల్ కొరత కృత్రిమమే



### -వైస్సార్సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి

అమరావతి ఏప్రిల్ 27: రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది సహజంగా ఏర్పడిన సంక్షోభం కాదని, కూటమి నాయకులు, పెట్రోల్ బంకుల డీలర్లు కుమ్మక్కై సృష్టించిన కృత్రిమ కొరత అని సంచలన ఆరోపణలు చేశారు. సమస్య వచ్చినప్పుడు దాన్ని అనుకూలంగా మార్చుకుని దోచుకోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, ఇప్పుడు పెట్రోల్, డీజిల్ విషయంలోనూ అదే జరుగుతోందని విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన

2 లో

## పని చేసే బాధ్యత మాది



**- సహకరించే బాధ్యత మాది- నిరూపించుకోవాల్సిన బాధ్యత మీదే"--ఏపీ సీఎం చంద్ర బాబు**

**- రూ.112 కోట్ల విలువైన 9 ప్రాజెక్టులకు శంకుస్థాపన**

విశాఖ ఏప్రిల్ 27: గత వైభవాన్ని స్మరిస్తూనే భవిష్యత్‌కు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం "పని చేసే బాధ్యత మాది, సహకరించే బాధ్యత మాది, కానీ నిరూపించుకోవాల్సిన బాధ్యత మీదే" అంటూ విద్యార్థులను ఉత్తేజపరిచారు. బంగారం లాంటి విద్యార్థులు, మంచి ప్రొఫెసర్లు ఉన్నారని, ప్రపంచంలోని జ్ఞానాన్ని ఇక్కడికి తీసుకొస్తామని హామీ ఇచ్చారు"వంద సంవత్సరాల వేడుక రోజు చెబుతున్నా, రాబోయే వంద సంవత్సరాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) మరో సరికొత్త చరిత్రను సృష్టిస్తుంది... ప్రపంచంలోనే ఓ ఉత్తమ బ్రాండ్‌గా నిలుస్తుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో జరిగిన ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని

2 లో

## మన మూలాలను మరువద్దు

### -మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు




విశాఖ ఏప్రిల్ 27 : మన మూలాలను, మాతృభాషను ఎన్నటికీ మరువద్దని విద్యార్థులకు హితవు చెప్పారు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఇష్టపడిన పనిని కష్టపడి చేస్తే జీవితంలో ఉన్నత స్థాయికి చేరవచ్చని ఉద్బోధ చేసారు.ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తనదైన శైలిలో ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. పూర్వ విద్యార్థిగా తాను చదువుకున్న విశ్వవిద్యాలయం వేదికపై నిలబడి ప్రసంగిస్తున్నందుకు తన మనసు భావోద్వేగంతో నిండిపోయిందని చెబుతూ, యువతకు దిశానిర్దేశం చేశారు. మారుతున్న కాలంలో యువత అనుసరించాల్సిన జీవన విధానం, దేశభక్తి,

2 లో

## అవినీతిలో ఇద్దరూ ఇద్దరే

### - రాహుల్ గాంధీ




న్యూఢిల్లీ ఏప్రిల్ 27 :పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీపై కాంగ్రెస్ఎంపీ రాహుల్ గాంధీ మరో సారి విమర్శలు గుప్పించారు. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి అయితేనే ఉద్యోగం వస్తుందని, సామాన్యులకు ఎదురుచూపులే మిగులుతున్నాయని అన్నారు. అవినీతిలో ప్రధానమంత్రి మోదీకి దీదీ ఏమాత్రం తక్కువ కాదని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాహుల్ విమర్శించారు.టీఎంసీ అవినీతి గురించి బెంగాల్ ప్రజలందరికీ తెలుసు. ప్రధానమంత్రి మోదీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ ఎప్పుడూ దీదీ జోలికి

2 లో

## ఇంధన కొరత ఏర్పడినందుకు చంద్రబాబు సిగ్గుపడాలి

### - ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల



అమరావతి ఏప్రిల్ 27 : రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్రంగా స్పందించారు. కేవలం సమీక్షలు, సలహాలతో ఇంధన కొరత తీరదని, 24 గంటల డెడ్ లైన్‌తో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 70 శాతం బంకులు మూతపడటం అత్యంత దారుణమని, దీనిని అత్యవసర పరిస్థితిగా గుర్తించి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. "దేశంలో ఎక్కడా లేని ఇంధన కొరత ఏపీలోనే ఏర్పడినందుకు చంద్రబాబు సిగ్గుపడాలి. ప్రజలను ఎర్రటి ఎండలో కిలోమీటర్ల మేర నిలబెట్టడం కూటమి పాలనా వైఫల్యానికి నిదర్శనం"అని షర్మిల మండిపడ్డారు. మోదీకి మద్దతు ఇచ్చి ప్రధాని పీఠంపై కూర్చోబెట్టినా రాష్ట్రానికి ఇంధన కష్టాలు రావడం బాధాకరమన్నారు. ఇంధన కొరతవల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే ప్రమాదం ఉందని, ప్రభుత్వం వెంటనే నిద్రమత్తు వీడాలని హెచ్చరించారు.

## బీఆర్ఎస్ ఓ 'చచ్చిన శవం'

### - కవిత పార్టీ అవసరమే లేదు: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ ఏప్రిల్ 27:కొత్త ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీ చచ్చిపోయిందని ఆయన అన్నారు. "చనిపోయిన శవానికి ఎంత అలంకరణ చేసినా ప్రయోజనం ఉండదు.. బీఆర్ఎస్ పరిస్థితి కూడా ఇప్పుడు అలాగే ఉంది" అంటూ విరుచుకుపడ్డారు. పదేళ్ల అహంకార పూరిత పాలన వల్లే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని, దాని మనుగడే ప్రశ్నార్థకమైందని వ్యాఖ్యానించారు. ఇదే క్రమంలో కల్వకుంట్ల కవిత ప్రకటించిన కొత్త పార్టీపై పరోక్షంగా సెటైర్లు వేస్తూ.. రాష్ట్రంలో కొత్త

2 లో

# సంపాదకీయం

## శాంతి చర్చల పేరుతో దొంగాట !

ప్రపంచం శాంతిగా ఉండడం అటు అమెరికాకుకు, ఇటు ఇజ్రాయిల్‌కు ఇష్టం లేనట్లుగా ఉంది. తానో శాంతి కాముకుడినని చెప్పుకున్న ట్రంప్ చేస్తున్న చర్యలు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచాన్ని అశాంతిలోకి నెట్టాయి. దాదాపు రెండు నెలలు కావస్తుందో. ఇరాన్‌పై దాడిని ప్రారంభించిన ఫిబ్రవరి 28 నుంచి ఎప్రిల్ 28 వరకు ..పరిస్థితులు గమనిస్తూ ఇద్దరూ రావణ కుంభకర్ణుల్లా ప్రపంచం మీద విరుచుకు పడుతున్నారు. ఇరాన్ ప్రత్యక్షంగా మిగతా దేశాలు పరోక్షంగా తీవ్రంగా దెబ్బతింటున్నాయి. అయినా రక్తం మరిగిన పులిలా ఈ ఇద్దరూ తమ పంతాన్ని వీడడం లేదు. యుద్ద ముగింపు కోసం ఆడుతున్న నాటకాలు ప్రజలు గమనిస్తు న్నారు. శాంతి చర్చల పేరిట ఇరాన్‌ను గుప్పిట పెట్టుకోవాలని చూస్తున్నారు. గల్ఫ్ చమురు ఉత్పత్తిలో ఎదురవుతున్న అంతరాయం అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను కుదిపేస్తోంది. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు తలెత్తడానికి ముందు ఉత్పత్తి అయిన ముడి చమురుతో పోలిస్తే రోజుకు సుమారు 14.5 మిలియన్ బ్యారల్స్ ఉత్పత్తి నిలిచిపోయింది. అంటే ఘర్షణకు ముందు జరిగిన ఉత్పత్తిలో 57 శాతం పడిపోయిందని తెలుస్తోంది. పనిలోపనిగా భారత్ చైనాలను నరక కూపాలని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆయన మూర్ఖత్వాన్ని బయటపెట్టాయి. ఇరాన్‌పై ఒత్తడి పెంచడం తప్ప ఇప్పటి వరకు జరిగిన చర్చల్లో ఎలాంటి పురోగతి లేదు. రసాయన ఆయుధాలు ఉన్నాయని గతంలో ఇరాక్‌పై దాడి చేసి, ఇరాక్ అధ్యక్షుడు సద్దం హుస్సేన్‌ను బలి తీసుకున్నారు. అక్కడ రసాయన ఆయుధాలు లేవని తేలింది. ఇప్పుడు ఇరాన్‌లో యురేనియం ఉందని, అణ్వాయుధాలు ఉన్నాయని బుకాయించి ఇరాన్‌పై పనిగట్టుకుని దాడి చేశారు. దేశాధినేత ఖమేనని మట్టుపెట్టారు. రెండు నెలలుగా ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం ఏర్పడ్డా పట్టించుకోవడం లేదు. స్వదేశంలో ట్రంప్‌కు విపరీతమైన వ్యతిరేకత వస్తున్నా లెక్క చేయడం లేదు. ఈ క్రమంలో ఇస్లామాబాద్ వేదికగా శాంతి చర్చలు ముందుకు సాగడం లేదు. అమెరికా, ఇజ్రాయిల్ డబుల్‌గేమ్ ఆడుతున్నాయనే చర్చ నడుస్తోంది. ఓ వైపు శాంతి చర్చలంటూ దౌత్యం నడుపుతూ.. మరోవైపు అరేబియా సముద్రంలో అమెరికా యుద్ధ నౌకల్ని మోహరింప జేస్తోంది. హర్మూజ్‌పై పట్టు సాధించే ప్రయత్నం చేస్తోంది. ఇరాన్‌ను దిగ్బంధించే యత్నాలను యానుకో లేదు. ఇరాన్, అమెరికా మధ్య చాలా అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరినా, కొన్ని విషయాలు ఒప్పందానికి అడ్డంకిగా మారాయని తెలుస్తోంది. ముఖ్యంగా 20 ఏళ్ల పాటు యురేనియం శుద్ధిని నిలిపివేయాలన్న అమెరికా డిమాండ్‌ను ఇరాన్ అంగీకరించాల్సిందేనని ట్రంప్ పట్టుబడుతున్నారు. ఇదే అంశంపై విలేకరులతో మాట్లాడుతూ ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను తయారు చేయకూడదన్నదే తమ ఏకైక లక్ష్యమని ట్రంప్ వెల్లడించారు. లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రకటించినా, ఇజ్రాయిల్ వైమానిక దాడులతో జనావాసాలపై విరుచుకుపడుతూనే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాతో శాంతి చర్చలపై అనిశ్చితి నెలకొన్నదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విధిస్తున్న ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనం, బెదిరింపుల నడుమ ఆ దేశంతో చర్చలు అసాధ్యమని తేల్చి చెప్పారు. ఇదే విషయాన్ని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు. శాంతి చర్చలపై ఇరాన్ వైఖరిని స్పష్టం చేశారు. ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని వదులుకోదని, అలాగే ఒత్తిళ్లకు తలొగ్గి ఒప్పందాలు చేసుకోబోదని పెజెష్కియాన్ స్పష్టం చేశారు. ప్రస్తుత ఉద్రిక్తతలకు అమెరికానే కారణమని పెజెష్కియాన్ పేర్కొన్నారు. అమెరికా అనుసరిస్తున్న చర్యలే చర్చలకు ప్రధాన అడ్డంకి ఆయన పాక్ ప్రధానితో చెప్పినట్లు ఓ మీడియా వెల్లడించింది. ఏప్రిల్ 13 నుంచి ఇరాన్ ఓడరేవులను అమెరికా నౌకాదళం దిగ్బంధించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం వల్ల ఇరాన్ ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఇలాంటి దిగ్బంధనాల నడుమ పరస్పర నమ్మకాన్ని పునరుద్ధరించడం అసాధ్యమని పేజెష్కియాన్ వెల్లడించారు. అందుకే ఇరు దేశాల మధ్య చర్చలు జరగాలంటే ముందుగా అమెరికా ఆంక్షలను తొలగించి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదన్న తన షరతును ట్రంప్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఇరాన్ తమను టెలిఫోన్‌లో సంప్రదించవచ్చునని, వారు ఎప్పుడు కోరుకుంటే అప్పుడు మాట్లాడవచ్చునని ట్రంప్ చెప్పారు. హోర్ముజ్ జలసంధి నుంచి మందుపాతరలను తొలగించే పనిలో అమెరికా నౌకాదళం నిమగ్నమైందని ట్రంప్ తెలిపారు. ఇస్లామాబాద్ నుంచి వెళ్లిపోయిన తర్వాత ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందించారు. ఇప్పటికే తాము ఒక ఫ్రేమ్ వర్క్‌ను పాకిస్తాన్‌కు అందించామని తెలిపారు. యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేందుకు ఇది ఒక మంచి మార్గమని ఆయన చెప్పారు. శాంతి చర్చలపై అమెరికాకు నిజంగా ఆసక్తి ఉందా అన్నది అనుమాన మేనని కూడా అన్నారు. ఇకపోతే త్తిడి, బెదిరింపు, స్వాధీనాల నడుమ ఒప్పందం ఎలా సాధ్యపడుతుందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రశ్నించారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో జరిపిన టెలిఫోన్ సంభాషణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్య చేశారని ఇరాన్‌కు చెందిన మెహర్ వార్తా సంస్థ తెలిపింది. చర్చలు, కాల్పుల విరమణ సందర్భాల్లో అమెరికా పదేపదే ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉన్నదని, నిర్బంధాలకు తెగబడుతోందని ఆయన అన్నారు. ఇరాన్ ఓడరేవులపై నిషేధం కాల్పుల విరమణ అవగాహనకు తూట్లు పొడవడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ శుద్ధి చేసిన 400 కిలోల యురేనియంను తనకు అప్పగించాలని అమెరికా కోరుతుండగా ఇరాన్ ససేమిరా అంటోంది.

## అవినీతిలో ఇద్దరూ ఇద్దరే

వెళ్లలేదు. ఎందుకంటే అసలైన పోరాటం టీఎంసీతో కాదనే విషయం వాళ్లకు బాగా తెలుసు. బీజేపీతో పోరాటం చేస్తున్న పార్టీ కాంగ్రెస్ మాత్రమే. బీజేపీ ఓట్ల చోరీ చేస్తుంది. ఓట్ల చోరీతోనే మహారాష్ట్ర, హర్యానాలో వాళ్లు గెలిచారు' అని రాహుల్ ఆరోపించారు. బీజేపీ, టీఎంసీ అవినీతే వల్లే పశ్చిమబెంగాల్ అతలాకుతలమైందని, రాష్ట్ర యువత నిరాశానిస్పృహల్లో ఉన్నారని, మహిళలకు భద్రత లేదని, ఆ కారణంగానే ప్రజలు మార్పును కోరుకుంటున్నారని రాహుల్ చెప్పారు. జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ పాత్ర చాలా కీలకమని, బీజేపీని ఓడించ గలిగే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని అన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడే పార్టీ అని, బీజేపీతో ఎట్టిపరిస్థితుల్లోనూ తాము రాజీపడే ప్రసక్తే లేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకూ ప్రజలను ఏకం చేసేందుకు భారత్ జోడో యాత్ర నిర్వహించిందని, ప్రధానమంత్రి మాత్రం దేశాన్ని విడగొట్టేందుకు నిరంతరం యాత్రలు సాగిస్తుంటారని విమర్శించారు. 56 అంగుళాలు ఛాతీ ఉందని చెప్పుకునే ప్రధానమంత్రి అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇతర యూఎస్ నేతల ముందు తలవంచుతారని విమర్శించారు. సుభాష్ చంద్రబోస్, మహాత్మాగాంధీ, నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఎన్నడూ ఎవరికీ తలవంచలేదని, దేశం కోసం ప్రాణత్యాగాలు చేసి, ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గిన ఎందరో నేతలు ఎవరి ముందు తలవంచలేదని, వారే నిజమైన దేశభక్తులని కొనియాడారు.

## మన మూలాలను మరువద్దు

మాతృభాషాభిమానం వంటి అంశాలపై ఆయన చేసిన ప్రసంగం ఆలోచింపజేసింది. ప్రసంగంలో వెంకయ్యానాయుడు ప్రధానంగా యువత తమ మూలాలను మర్చిపోకూడదని బలంగా చెప్పారు. “కన్న తల్లిని, జన్మభూమిని, మాతృభాషను, చదువుకున్న విద్యాలయాన్ని, పాఠం చెప్పిన గురువును మర్చిపోయినవాడు మానవుడే కాదు” అని ఆయన ఉద్ఘాటించారు. ప్రతి ఒక్కరూ తాము ఎక్కడి నుంచి వచ్చామో గుర్తుంచుకొని, ఏ స్థాయికి ఎదిగినా తాము పుట్టిన ప్రాంతం అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తాను ఒక సాధారణ పల్లెటూరి నుంచి వీధి బడిలో చదువుకొని, క్రమశిక్షణ, కఠోర శ్రమ, అంకితభావం కారణంగానే దేశ రెండవ అత్యున్నత పదవిని అధిరోహించగలిగానని తన జీవితాన్ని ఉదాహరణగా చూపారు. “ఇష్టపడిన పనిని కష్టపడి చేస్తే నష్టపోయేది లేదు” అనే మంత్రాన్ని యువతకు అందించారు. ఆధునిక పోకడలపై వెంకయ్యానాయుడు తనదైన శైలిలో చురకలు అంటించారు. పాశ్చాత్య ఆహారపు అలవాట్లపై మాట్లాడుతూ, “ఈ పిజ్జాలు, బర్గర్లు మన ఒంటికి పడవు. మన పూర్వీకులు అందించిన వంటకాలు, జీవన శైలినే మనం కొనసాగించాలి” అని హితవు పలికారు. ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాముఖ్యతను వివరిస్తూ, చిన్న వయసులోనే క్యాన్సర్, డయాబెటిస్ వంటి వ్యాధులు రావడానికి జీవనశైలే కారణమని, యువత వ్యసనాలకు, ముఖ్యంగా డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. అదేవిధంగా, మహనీయుల పేర్లను, రోడ్ల పేర్లను సంక్షిప్తంగా పిలవడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. “మహాత్మా గాంధీ రోడ్డును ఎంజీ రోడ్ అని, సర్దార్ పటేల్ రోడ్డును ఎస్పీ రోడ్ అని పిలుస్తున్నారు. ఇంగ్లీష్ వాడు పోతూ పోతూ మనకు ఈ పొట్టి పొట్టి మాటలు అలవాటు చేసిపోయాడు. మన పేర్లను మనం గర్వంగా, పూర్తి పేరుతో పిలవాలి. మీ పేరు కింజరాపు రామ్మోహన్ నాయుడు అయితే, గర్వంగా చెప్పగలగాలి కానీ, కేఆర్ నాయుడు అంటే సందేశం వెళ్లదు” అంటూ తనదైన ఛలోక్తులు విసిరారు. మాతృభాష ఆవశ్యకతను నొక్కి చెబుతూ, “తెలుగు మన కంటి చూపు లాంటిది, ఇంగ్లీష్ కళ్లద్దాల వంటిది. కంటిచూపు బాగుంటేనే కళ్లద్దాలు పనిచేస్తాయి. కంటి చూపే లేకపోతే నువ్వు ఏ రేబాన్ గ్లాస్ పెట్టుకున్నా ప్రయోజనం ఉండదు” అని అద్భుతంగా పోల్చారు. “ఫస్ట్ మదర్ టంగ్, తర్వాత బ్రదర్ టంగ్, లేటర్ ఎనీ అదర్ టంగ్” అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. అన్ని భాషలు నేర్చుకోవాలి, కానీ మాతృభాషను ఎన్నటికీ విస్మరించకూడదని స్పష్టం చేశారు. పరిశోధనల తీరుపై వెంకయ్యానాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశోధనలు కేవలం థీసిస్ పేపర్లకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా జరగాలని ఉద్ఘాటించారు.

## ఏపీలో పెట్రోల్, డీజిల్ కొరత కృత్రిమమే

వెంటనే ఇంధన ధరలు పెరుగుతాయనే అంచనాలతో డీలర్లు ఉద్దేశపూర్వకంగా నిల్వలను బ్లాక్ చేస్తున్నారని జగన్ ఆరోపించారు. ఈ దోపిడీ పర్వంలో వారితో కూటమి నాయకులు జతకట్టి, లబ్ధి పొందేందుకు సిద్ధమయ్యారని అన్నారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలో ఎలాంటి కొరత లేనప్పుడు, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఈ పరిస్థితి ఎందుకు తలెత్తిందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం చెబుతున్నట్లు సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేవని, ఇది పూర్తిగా మానవ సృష్ట సంక్షోభమని జగన్ స్పష్టం చేశారు. ఈ కృత్రిమ కొరత కారణంగా అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఇది రబీ పంటల కోతల సమయం కావడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని అన్నారు. పంట నూర్పిడి యంత్రాలకు రోజుకు 100 నుంచి 160 లీటర్ల డీజిల్ అవసరం కాగా, సరఫరా నిలిచిపోవడంతో యంత్రాలు పొలాల్లోనే ఆగిపోతున్నాయని తెలిపారు. దీనివల్ల రైతులు కోలుకోలేని నష్టాలను చవిచూస్తున్నారని వివరించారు. అలాగే, ఆక్వా రంగంలో ఏరియేటర్లు నడిపేందుకు డీజిల్ అందక రొయ్యలు, చేపల రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ తీవ్రమైన సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు కనీసం ఒక సమగ్ర సమీక్ష కూడా నిర్వహించకుండా, కేవలం మీడియాకు లీకులిస్తూ కాలయాపన చేస్తున్నారని జగన్ దుయ్యబట్టారు. సరఫరా తగ్గుతుందనే భయంతో ప్రజలే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారని కుంటిసాకులు చెప్పడం సిగ్గుచేటన్నారు. గతంలో విత్తనాలు, ఎరువులు, యూరియా నుంచి వంట గ్యాస్ వరకు ఇలాగే కృత్రిమ కొరత సృష్టించి చంద్రబాబు లబ్ధి పొందారని, ఇప్పుడు ఆ జాబితాలో పెట్రోల్, డీజిల్‌ను చేర్చారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి పరిస్థితిని చక్కదిద్దాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని, తగిన గుణపాఠం చెబుతారని జగన్ హెచ్చరించారు.

## పని చేసే బాధ్యత మాది

ప్రసంగించారు. విద్యార్థులు, పూర్వ విద్యార్థుల ఉత్సాహాన్ని చూస్తుంటే వారి ఆనందం ఆకాశాన్ని తాకుతోందని అభినందించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. వందేళ్ల ఏయూ పండుగ ఒక చారిత్రక ఘట్టమైతే, ప్రపంచ టెక్నాలజీ దిగ్గజం గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేయడం మరో చరిత్ర అని అన్నారు. గూగుల్ కంటే ముందే ఏయూ తన ఖ్యాతితో ప్రపంచాన్ని విశాఖతో అనుసంధానం చేసిందని, వివిధ దేశాల విద్యార్థులు ఇక్కడ చదవడం రాష్ట్రానికే గర్వకారణమని కొనియాడారు. రాష్ట్ర విభజన తర్వాత మొట్టమొదటి కేబినెట్ సమావేశాన్ని ఏయూలోనే నిర్వహించామని, ఇది ఈ వర్సిటీకున్న ప్రత్యేకతను చాటుతోందని గుర్తుచేశారు. ఏయూ చారిత్రక నేపథ్యాన్ని, దానికి సేవ చేసిన మహానుభావులను చంద్రబాబు స్మరించుకున్నారు. స్వాతంత్ర్య పోరాటం కంటే ముందే ఏర్పాటైన ఈ విశ్వవిద్యాలయ అభివృద్ధికి జైపూర్ రాజా విక్రమ దేవ్, గజపతి, పిఠాపురం, బొబ్బిలి రాజవంశీయులు చేసిన కృషిని మర్చిపోలేమని అన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన కట్టమంచి రామలింగారెడ్డి తొలి వీసీగా బలమైన పునాది వేస్తే, రెండో వీసీ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశ రాష్ట్రపతిగా ఎదిగారని గుర్తుచేశారు. వెంకయ్య నాయుడు వంటి ఎందరో రాజకీయ ఉద్దండులను, పారిశ్రామికవేత్తలను అందించిన ఘనత ఏయూదని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రూ. 112 కోట్లతో 9 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా వంటి ప్రతిష్టాత్మక సంస్థలతోపని చేసే బాధ్యత మాది ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. యూనివర్సిటీలు కేవలం డిగ్రీలు ఇచ్చే కేంద్రాలుగా కాకుండా, సమాజాన్ని ప్రభావితం చేసే ఆవిష్కరణలకు, స్టార్టప్‌లకు వేదిక కావాలని పిలుపునిచ్చారు. నాలెడ్జ్, ఇన్నోవేషన్, స్టార్టప్‌లపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. . గతం స్ఫూర్తితో భవిష్యత్‌లో ఏయూ మరో అద్భుతమైన చరిత్ర సృష్టిస్తుందన్న పూర్తి విశ్వాసం తనకుందని చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు.

## విజయం కన్నా ఓటమే గొప్ప పాఠం నేర్పుతుంది

వందేళ్లుగా ఎన్నో చారిత్రక ఘట్టాలకు సాక్ష్యంగా నిలిచిందని, ఎందరో మేధావులను దేశానికి అందించిందని గుర్తుచేశారు. ముఖ్యంగా ఈ యూనివర్సిటీ రెండో ఉపకులపతిగా పనిచేసి, ఆ తర్వాత భారత తొలి ఉపరాష్ట్రపతిగా, రెండో రాష్ట్రపతిగా సేవలందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మేధోసంపత్తిని, నైతిక స్పష్టతను స్మరించుకున్నారు.

విద్య ద్వారా మేధస్సుతో పాటు వ్యక్తిత్వాన్ని కూడా పెంపొందించాలన్న ఆయన ఆశయం నేటికీ ఆదర్శనీయమన్నారు. నోబెల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు వంటి ఎందరో ప్రముఖులు ఈ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు కావడం గర్వకారణమన్నారు. శాంతిస్వరూప్ భట్నాగర్, పద్మవిభూషణ్, పద్మశ్రీ వంటి ఎన్నో పురస్కారాలు పొందిన మేధావులను అందించిన ఘనత ఏయూదని ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంపై కూడా ఉపరాష్ట్రపతి ప్రశంసలు కురిపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని అన్నారు. గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం, ఆంధ్రప్రదేశ్ సామర్థ్యంపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. అమరావతిని శాశ్వత రాజధానిగా ప్రకటించే బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందినప్పుడు తాను రాజ్యసభకు అధ్యక్షత వహించానని, ఆ క్షణంలో ఏపీ ప్రజల ముఖాల్లో ఆనందాన్ని చూశానని గుర్తు చేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్న “వికసిత భారత్” నిర్మాణానికి “వికసిత ఆంధ్రప్రదేశ్” దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్ ఓ ‘చచ్చిన శవం’

పార్టీ పెట్టాల్సిన అవసరమే లేదని, అసలు ఉన్న పార్టీయే (బీఆర్ఎస్) ఉంటుందో, ఊడుతుందో తెలియని స్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త పార్టీలకు ప్రజలు అవకాశం ఇవ్వరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని, శత్రువు కాదని అన్నారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉండటం తనకే మంచిదని, రాజకీయంగా ఎదుర్కోవడం సులభమవుతుందని వ్యాఖ్యానించారు. విశ్రాంతి తీసుకుంటున్న ప్రజా ప్రతినిధి గురించి చెడు కోరుకోవడం తన స్వభావం కాదని తెలిపారు. కేసీఆర్‌కు గాయమైనప్పుడు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించానని, అసెంబ్లీకి వచ్చినప్పుడు కూడా ఆయన్ను కలిసి యోగక్షేమాలు అడిగానని రేవంత్ రెడ్డి తెలిపారు. రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా గౌరవం ఉందని పేర్కొన్నారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ బతికి ఉంటే తమకు అధికారం రాదని ఆయన కుటుంబ సభ్యులే భావిస్తున్నారని వ్యాఖ్యానించారు.

వాళ్లంతా ఒక్కటే.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే కేటీఆర్ ముఖ్యమంత్రి కావాలని మంత్రులతో ప్రకటనలు చేయించారని ఆరోపించారు. అధికార పంపకాల విషయంలో తేడాలు రావడంతో కుటుంబంలో విభేదాలు వచ్చాయని అన్నారు. అయితే, వాళ్లంతా ఒక్కటేనని వ్యాఖ్యానించారు. అనుబంధ సంఘాలను ప్రభుత్వంపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి కి ఘనంగా సత్కారం

## - కార్యకర్తలకు సముచిత న్యాయం టిడిపికే సాధ్యం
## - మాజీ మార్కెట్ చైర్మన్ సయ్యద్ జవహర్ భాష





సిద్ధవటం ప్రజా సీమ : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు సముచిత న్యాయం టిడిపికే సాధ్యమని మాజీ మార్కెట్ చైర్మన్ సయ్యద్ జవహర్ భాష తెలిపారు మండల కేంద్రమైన సిద్ధవటం ఎంపీపీ సభా భవనంలో సోమవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి శనివారపు మోహన్ రెడ్డికి ఘనంగా సత్కరించి గజ మాలలు వేశారు.

ఈ సందర్భంగా మాజీ మార్కెట్ చైర్మన్ సయ్యద్ జవహర్ భాష మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడ్డ శనివారపు మోహన్ రెడ్డికి టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం పట్ల కార్యకర్తల్లో నూతన ఉత్సాహం ఏర్పడిందని గత ఐదేళ్లలో పార్టీ విజయం కోసం ఆలు పెరగని పోరాటం చేసి కార్యకర్తలకు ఒక భరోసా కల్పించారని పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను సరైన గుర్తింపు ఇచ్చే పార్టీ టిడిపి పార్టీ అని తెలిపారు టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ప్రతి ఒక్కటి అమలు చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పార్టీ విజయం కోసం కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు దారపునేని దశరధ రామానాయుడు, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు జ్యోతి జగదీశ్వర్ రెడ్డి, నిత్య పూజ కోన చైర్మన్ రాజేంద్రప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు మల్లు సంజీవరెడ్డి, సయ్యద్ జవహర్ భాష, మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి, ఎంపీపీ ప్రతినిధి చంద్రశేఖర్ , సింగిల్ విండో డైరెక్టర్ బాలిరెడ్డి, మాజీ సింగల్ డైరెక్టర్ ఖాజాపీర్,, వెంకటయ్య, వినోద్, మస్తాన్ తదితల టిడిపి నేతలు పాల్గొన్నారు.

# టీడీపీ కేఎస్ఎస్ బూత్ కన్వీనర్లు యూనిట్ ఇన్చార్జిలు క్లస్టర్ ల సమావేశం

## - స్టేట్ డైరెక్టర్ డాక్టర్ నాగూర్ వీరభద్రుడు





సిద్ధవటం ప్రజా సీమ : కోదూరు నియోజక వర్గం పుల్లంపేట మండలం టిడిపి మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో వీక్ ఫోకస్ బూతుల లలో కెఎస్ఎస్ బూత్ కన్వీనర్లు యూనిట్ ఇన్చార్జిలు క్లస్టర్ ల ఆధ్వర్యంలో బూతుల సంఖ్య,196 198 199 200 201 205. బూతులలో ఏపీ స్టేట్ నూర్ భాషా / దూదేకుల కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు పర్యటించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బూతులలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను నాయకులను అందర్నీ కలుపుకొని పోయి తెలుగుదేశం పార్టీ రాబోయే లోకల్ బాడీ ఎలక్షన్లలో టిడిపిని అన్ని స్థానాల్లో గెలిపించాలని అందరూ ఐకమత్యంతో పని చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో బూత్ ఇన్చార్జులు యూనిట్ ఇన్చార్జులు కేఎస్ఎస్ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఏబీఎన్ రాధాకృష్ణపై సత్వరమే కేసు నమోదు చేయాలి

## - కూటమి పాలనలో రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలు
## - అన్నమయ్య జిల్లా ఎస్పీకి పిర్యాదు చేసిన వైసీపీ ముఖ్యనేతలు





మదనపల్లె : మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన ఎబిఎన్ రాధాకృష్ణ కొత్తపలుకు కాదు చెత్త పలుకు అని పేరు పట్టుకోవాలని,రాధాకృష్ణపైన కేసు నమోదు కాకుండా సిఎం చంద్రబాబునాయుడు అడ్డుకుంటున్నారని వైఎస్ఆర్సిపి ముఖ్య నేతలు ఆరోపించారు.పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఎబిఎన్ రాధాకృష్ణపై కేసు నమోదు చేయాలని సోమవారం మదనపల్లెలోని అన్నమయ్య జిల్లా ఎస్పీకి మాజీ ఎంపీ రెడ్డెప్ప,మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి,మదనపల్లి వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహ్మద్,శ్రీనాథ్ రెడ్డి,వైకాపా స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ షమీం అస్లాం,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మనూజా రెడ్డి,వి.ఎస్ రెడ్డి,కొత్తపల్లి మహేష్ బాబు,నరసింహులు నాయుడు,నాగిరెడ్డి,చరణ్ తదితరులు పిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎబిఎన్ రాధాకృష్ణ చెప్పేది కొత్త పలుకు కాదు - చెత్త పలుకు అని ఎద్దేవా చేశారు. మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన ఎబిఎన్ రాధాకృష్ణ పైన రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ఆర్సిపి శ్రేణులు పిర్యాదు చేస్తే సిఎం చంద్రబాబునాయుడు కేసు నమోదు కాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నాయకుల దాడులు,దౌర్జన్యాలు ఎక్కువ కావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారని ఆరోపించారు.రెండు రోజుల క్రితం తిరుపతి - మదనపల్లె జాతీయ రహదారిపై కల్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్ర బాబు అనుచరులు టోల్ గేటు సిబ్బందిపైన దాడి చేస్తే ఇప్పటి వరకు కేసులు నమోదు కాలేదన్నారు.టోల్ గేటులో పనిచేసే మహిళ సిబ్బందిపైన దాడులు చేయడం స్పష్టంగా కనిపిస్తున్న ఎందుకు చర్యలు తీసుకోదని ప్రశ్నించారు.పిర్యాదు చేయడానికి కూడా టోల్ గేటు సిబ్బంది భయపడే పరిస్థితి నెలకొందని ఆరోపించారు.రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపించారు.సిఎం చంద్రబాబునాయుడు అండ చూసుకుని తెలుగుదేశం పార్టీ నాయకులు ఎక్కడికక్కడ రెచ్చిపోతుంటే సిఎం చంద్రబాబునాయుడు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారన్నారు.మీరే ఏమైనా చేయండి,నేను చూసుకుంటా అనే రీతిలో సిఎం వ్యవహరించడం దారుణంగా ఉందన్నారు.ఇదేనా మీ 40 సంవత్సరాల అనుభవం అని ప్రశ్నించారు.కూటమి నాయకుల దాడులు,దౌర్జన్యాలతో రాష్ట్రంలో ప్రశాంతత కరువైందన్నారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైఎస్ఆర్ సిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెట్రోల్,డీజిల్ కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు

## - అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి హెచ్చరిక
## - ఇంధన నిల్వలు పుష్కలం - వదంతులు నమ్మవద్దని వెల్లడి



మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని,ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి స్పష్టం చేశారు. సోమవారం ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో జిల్లాలోని ప్రస్తుత ఇంధన పరిస్థితిని వివరించారు.ప్రస్తుతం రాష్ట్రంలో పెట్రోల్ మరియు డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ఎస్పీ తెలిపారు.రవాణా వ్యవస్థలో తలెత్తిన కొన్ని తాత్కాలిక సాంకేతిక కారణాల వల్ల సరఫరాలో స్వల్ప జాప్యం జరిగిందని,ఇది రెండు మూడు రోజుల్లోనే సాధారణ స్థితికి వస్తుందని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చమురు సంస్థల ప్రతినిధులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని,అన్ని బంకులకు ఇంధనం సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.వదంతులను నమ్మి,భయాందోళనతో అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేసి ఇళ్ల వద్ద నిలువ ప్రమాదమని ఎస్పీ హెచ్చరించారు.ఇళ్లలో ఇంధనాన్ని నిలువ చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.ప్రజలు ఇలా అనవసరంగా నిల్వలు చేయడం వల్ల,నిజంగా అవసరమైన వారికి ఇంధనం దొరకని పరిస్థితి ఏర్పడుతుందన్నారు.పోలీసులు రెవెన్యూ,సివిల్ సప్లైస్ శాఖలతో కలిసి ఇంధన నిల్వలు,సరఫరా పరిస్థితిని క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపారు.జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల వద్ద పోలీసు అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారని,రద్దీ ఎక్కువగా ఉన్న చోట ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించామని ఎస్పీ పేర్కొన్నారు.ఇంధన కొరతపై తప్పుడు ప్రచారం చేసినా,వదంతులు వ్యాప్తి చేసినా లేదా ఇంధనాన్ని అక్రమంగా నిలువ చేసి బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

# పీఎం-రాహత్ పథకంతో రోడ్డు ప్రమాద బాధితులకు వరం

## - 'గోల్డెన్ అవర్'లో తక్షణ చికిత్సతో ప్రాణాలకు భరోసా
## - జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ వెల్లడి



మదనపల్లె (ప్రజా సీమ) : రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు తక్షణ వైద్యం అందించి ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం-రాహత్ పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని,ఈ మేరకు ఈ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ వైద్యాధికారులకు సూచించారు.సోమవారం మదనపల్లి కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో పథకానికి సంబంధించిన ప్రచార పోస్టర్లను అధికారులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గోల్డెన్ అవర్'లో అత్యవసర చికిత్స అందించేందుకు రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం ఈ పథకం ద్వారా లభిస్తుందన్నారు.ప్రమాద బాధితుల ఆర్థిక పరిస్థితులు,స్థానికతతో సంబంధం లేకుండా ఆసుపత్రిలో చేరిన వెంటనే 7 రోజులపాటు లేదా రూ. 1.5 లక్షల వరకు ఉచిత చికిత్స అందించబడుతుందని తెలిపారు.డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా ఈ పథకం అమలు జరుగుతుండగా,రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రభుత్వ,ప్రైవేట్ ఆసుపత్రుల్లో సేవలు అందుబాటులో ఉన్నాయని,అన్నమయ్య జిల్లాలో 17 ఆసుపత్రులలో పథకం అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.ఆర్థో,పాలీట్రామా సేవలు ఉన్న ఆసుపత్రుల్లో తక్షణ వైద్యం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.రోడ్డు ప్రమాద వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేసి,పోలీసుల ధృవీకరణ అనంతరం చికిత్స,చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. బీమా ఉన్న కేసుల్లో బీమా సంస్థల ద్వారా హిట్ అండ్ రన్ వంటి కేసుల్లో పీఎఫ్ఎంఎస్ ద్వారా ఆసుపత్రులకు చెల్లింపులు జరుగుతాయని తెలిపారు.పోలీసు,వైద్య ఆరోగ్య,రవాణా శాఖల సమన్వయంతో పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ,ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని జేసీ తెలిపారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి,డిఎంహెచ్వో డాక్టర్ లక్ష్మీ నరసయ్య,డిసిహెచ్ఎస్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, డిపిఎమ్ఓ రమేష్,వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుల ధ్రువీకరణ పత్రాలలో సుప్రీంకోర్టు తీర్పును పరిగణలోకి తీసుకోండి



పుల్లంపేట (ప్రజా సీమ)రైల్వే కోడూరు నియోజకవర్గం, పుల్లంపేట మండలంలో ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేటప్పుడు, ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి వారు నిజమైన ఎస్సీల లేదా మతం మారిన క్రైస్తవుల అని విచారించి, వారికి కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సిందిగా హ్యూమన్ రైట్స్ సేఫ్ గార్డ్ సంస్థ ప్రతినిధులు అడ్వకేట్ అరుణ్ కుమార్ రాజు మరియు మహేష్ పుల్లంపేట ఎమ్మార్వో ను కోరడం జరిగినది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్టియన్ గా మతమార్పిడి చేసుకొని తమ అవసరాల కోసం ఎస్సీ సర్టిఫికెట్ను తీసుకుంటూ చాలా మంది దుర్వినియోగం చేస్తున్నారని, ఇటీవల సుప్రీంకోర్టు తీర్పున అనుచరించి పూర్తిగా పరిశీలించిన తర్వాతే వారికి కుల ధ్రువీకరణ పత్రం అందించాలని వారు కోరారు. ఎస్సీ ఎస్టి చట్టాన్ని అభివృద్ధి దుర్వినియోగం చేస్తున్నారని, కావున ఇలాంటి వారి వల్ల నిజమైన దళితులు ఇబ్బందులు పడుతున్నారని, అందుకే అధికారులను కలిసి ఈ విషయంపై క్షుణ్ణంగా పరిశీలించాలని వారు కోరారు.

# విదేశాలలో ఉన్నత విద్యపై మిట్స్ విద్యార్థులకు అవగాహన

**- వాట్ నెక్స్ట్ ఓవర్సీస్ సంస్థ హెడ్ సచిన్ సోని**





కురబలకోట (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు ఇంటర్నేషనల్ రిలేషన్స్ సెల్ వారి ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు విదేశీ ఉన్నత విద్యపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగళూరుకు చెందిన వాట్ నెక్స్ట్ ఓవర్సీస్ సంస్థ,బిజినెస్ అండ్ స్ట్రాటజీ హెడ్ సచిన్ సోని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని ఆశించే విద్యార్థులకు ప్రత్యక్షంగా విదేశీ విశ్వవిద్యాలయాలు అందించే స్కాలర్‌షిప్స్ అందిస్తున్నాయన్నారు. ఉన్నత విద్య కోసం ముందస్తు ప్రణాళికగా జి. ఆర్. ఇ,టోఫెల్,ఐ. ఇ. ఎల్. టి. ఎస్ వంటి పరీక్షలపై అవగాహన మరియు సమయానికి దరఖాస్తులు పంపడం వంటి ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల విద్యార్హతలు,ఆసక్తి మరియు కెరీర్ లక్ష్యాలను బట్టి సరైన యూనివర్సిటీ మరియు కోర్సు ఎంపికలో సహకరిస్తామన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్యలో అధునాతన తయారీ సాంకేతికతలు,రోబోటిక్స్, ఆటోమొబైల్, ఏరోస్పేస్ వంటి ప్రత్యేక విభాగాల్లో నైపుణ్యం పొందడానికి విదేశీ విశ్వవిద్యాలయాలు స్కాలర్‌షిప్‌లు,స్టైపెండ్లు ద్వారా అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. ఆధునిక ప్రయోగశాలలు,పరిశోధన సదుపాయాలు మరియు పరిశ్రమలతో అనుసంధానం ద్వారా విద్యార్థులకు అంతర్జాతీయస్థాయి జ్ఞానం లభిస్తుందన్నారు. విదేశాల్లో ఇంజనీరింగ్‌లో ఉన్నత విద్యఅభ్యసించడం వల్ల ప్రపంచ స్థాయి కెరీర్ అవకాశాలు,పరిశోధన మరియు ఇన్నోవేషన్‌లో పాల్గొనే అవకాశం, మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందడానికి విద్యార్థులు సరైన ప్రణాళికతో ముందుకు సాగడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో డీన్-అడ్మినిస్ట్రేషన్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డాక్టర్ శ్రీమంత బసు,సీనియర్ మేనేజర్ యూ. విజయ లక్ష్మి,సంస్థ ప్రతినిధులు ఆదిత్య సోమనాథ్,సాయంతని రాయ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఒకచోట జీతం -- మరొకచోట పని

**- నడిమిచర్ల గ్రామం వడ్డేపల్లి కేంద్రం పేరిట జీతం తీసుకుంటూ, కలకడలో విధి నిర్వహణ... - అధికారుల నిర్లక్ష్యం బహిర్గతం - నాలుగేళ్లుగా సమస్య ఉన్నా చర్యలు లేవు. - చిన్నారుల భవిష్యత్తుతో ఆటలు!**



కలకడ(ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లాలోని కలకడ మండలానికి చెందిన నడిమిచర్ల గ్రామం వడ్డేపల్లి అంగన్వాడీ కేంద్రం విషయంలో తీవ్ర అవకతవకలు వెలుగుచూశాయి. గ్రామంలో నిర్వహించాల్సిన అంగన్వాడీ కేంద్రాన్ని బాధ్యత వహిస్తున్న టీచర్ పిల్లలు లేరు అనే సాకుతో గత నాలుగు సంవత్సరాలుగా తనకు అనుకూలంగా మార్చుకుని, చిన్నారుల భవిష్యత్తుతో ఆటలాడుతున్నట్లు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా గ్రామంలోని పిల్లల పోషణ, ప్రాథమిక విద్య, ఆరోగ్య పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రం వడ్డేపల్లిలో ఉండాలి. కానీ, అక్కడి టీచర్ “పిల్లలు లేరు” అనే సాకుతో ఆ కేంద్రాన్ని వదిలిపెట్టి, తాను నివసిస్తున్న కలకడలోని అంగన్వాడీ కేద్రంలో కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇంకా విచిత్రం ఏమిటంటే, ఆమె అధికారికంగా నడిమిచర్ల గ్రామం వడ్డేపల్లి అంగన్వాడీ కేంద్రానికి సంబంధించిన జీతం తీసుకుంటూ, సేవలను మాత్రం కలకడ పంచాయతీలో అందిస్తోంది. ఇది ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకమని స్థానికులు మండిపడుతున్నారు. వడ్డేపల్లి గ్రామంలో ఉన్న చిన్నారులు అంగన్వాడీ సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య తనిఖీలు వంటి కీలక సేవలు అందకపోవడంతో వారి అభివృద్ధి దెబ్బతింటోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెబుతున్నారు. “మా పిల్లల భవిష్యత్తు గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. మా గ్రామంలో ఉండాల్సింనా టీచర్ అంగన్వాడి కేంద్రం నడపకపోవడం టీచరు కలకడ అంగన్వాడి కేంద్రంలో పనిచేయడం మా గ్రామంలో టీచర్ లేక అంగన్వాడి కేంద్రం మూసివేయడం చాలా అన్యాయం” అని గ్రామ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో సంబంధిత ఐసిడిఎస్ (×జణా) అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి అంగన్వాడీ కేంద్రాన్ని తిరిగి వడ్డేవల్లిలో ప్రారంభించాలనీ సంబంధిత అధికారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని పిల్లలకు తక్షణం సేవలు అందించాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. చిన్నారుల భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రం, అధికారుల నిర్లక్ష్యం వల్ల నిర్వీర్యమవడం దురదృష్టకరం. ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# పంచాయతీల సర్వతోముఖాభివృద్ధికే పి-ఫోర్ విధానం

**- ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా స్పష్టం**

**- సహకారం అందిస్తున్న దాతలకు ఘనసన్మానం**




మదనపల్లె (ప్రజా సీమ) : రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు నిమ్మనపల్లి మండలం,రాచవేటివారిపల్లి పంచాయతీలో పిఫోర్ క్రింద గ్రామంలోని చెరువు,కాలువలకు మరమ్మత్తులు చేయుటకు జెసిబిలకు స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం అందించిన దాతలకి శాసనసభ్యులు షాజహాన్ బాషా ఆధ్వర్యంలో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షాజహాన్ బాషా మాట్లాడుతూ గ్రామంలో రైతులు స్వచ్ఛందంగా కాలువల మరమ్మతు చేసుకోవడానికి ముందుకు రావడం సంతోషదాయకమని,ఇదే స్ఫూర్తితో మిగిలిన గ్రామాల ప్రజలందరూ కూడా ముందుకు రావాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన వస్తోందని,వర్షాకాలం లోపల కాలువలన్నీ పూర్తిచేసి చెరువులు నింపాలని కోరారు. అనంతరం ఆర్. జె వెంకటేష్ మాట్లాడుతూ మొదటి నుండి కూడా నీటిపారుదల పనులపైన ప్రత్యేక శ్రద్ధ వహించి చెరువులను నింపడం జరుగుతోందని శాసనసభ్యులు జహా కృషితో మొట్టమొదటిసారిగా గ్రామంలో హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలవల ద్వారా మన చెరువుకు నీళ్లు మళ్లించి నింపడం జరిగిందని ఇది ఒక చారిత్రాత్మక ఘట్టమని కొనియాడారు. ఎక్కడో కృష్ణానదిలో పుట్టి ప్రవహించే నీటిని లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఎగువమాచిరెడ్డిగారి పల్లెలోని పెద్ద చెరువుకు నీటిని నింపడం చాలా సంతోషమని,ఇది కేవలం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైందని వచ్చే సంవత్సరం మరిన్ని చెరువులకు కాలువల ద్వారా నీళ్లను మళ్లించి చెరువులు నింపడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆర్థిక సహాయం చేసిన ఆర్జే వెంకటేష్,చంద్రారెడ్డి,మణికంఠ,ఇండ్ల వెంకటరమణ,వసంత అనిల్,నరసింహారెడ్డి,బాబురావులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజన్న,సర్పంచ్ మధు,గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున,సింగల్ విండో అధ్యక్షుడు రమణ,మాజీ జడ్పిటిసి సుజాత,శ్రీపతి,మునిరత్న,విజయ్,మాజీ సర్పంచ్ లక్ష్మన్న,రఫీ,తెలుగు యువత అధ్యక్షుడు శివకృష్ణ,మాజీ జడ్పిటిసి రెడ్డెప్ప రెడ్డి,మహేష్ బాబు,ఎంపీడీవో,ఏవో పెద్ద ఎత్తున గ్రామ సచివాలయ సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్ర రజక సంఘాల సమాఖ్య వర్కింగ్ చైర్మనుగా ముసలికుంట నాగయ్య

**- నియామకా పత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షులు పి.షణ్ముగం**

**- శుభాకాంక్షలు తెలిపిన రజక సంఘాల నాయకులు**




మదనపల్లె (ప్రజా సీమ) : రజక సంఘాల సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ చైర్మనుగా ముసలికుంట నాగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతిలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు పి. షణ్ముగం,నాగయ్యకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి. షణ్ముగం మాట్లాడుతూ రజకులను ఏకతాటిపైకి తీసుకువచ్చి ఐక్యంగా వారిని ముందుకు తీసుకెళ్లటంలో నాగయ్య ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అదేవిధంగా వారి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం ముసలికుంట నాగయ్య స్పందిస్తూ జాతి అభివృద్ధి కోసం,ఐక్యత కోసం తనవంతు శక్తివంచన లేకుండా సేవలందిస్తానన్నారు. తమపై నమ్మకంతో రాష్ట్ర వర్కింగ్ చైర్మనుగా బాధ్యతలు అప్పగించినందుకు అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. జాతి అభివృద్ధి కోసం సమస్యలను పరిష్కారం చేసుకుని,హక్కులను సాధించుకోవడానికి అందరిని సమన్వయం చేసుకుని ముందుకు సాగుతామన్నారు. అలాగే మదనపల్లె నియోజకవర్గం టిడిపి బిసి సెల్ అధ్యక్షులుగా సేవలు అందించి,రజక సంఘాల సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ చైర్మనుగా ముసలికుంట నాగయ్య ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ,టిడిపి రజక సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు ముదిమడుగు రామ్మూర్తి,రజక సంఘాల నాయకులు కలిచర్ల రామ్మూర్తి,ఎస్టేట్ రమణ,రెడ్డెప్ప,శివలు శుభాకాంక్షలు తెలిపారు.

# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని చెప్పిన నాయకులు ఇప్పుడు ఎక్కడ?

**వైఎస్ఆర్సీపీ మైనారిటీ నాయకుడు మున్నీర్ విమర్శ**



వీలేరు (ప్రజా సీమ) :రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై వైఎస్ ఆర్సీపీ మైనారిటీ నాయకుడు మున్నీర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. “పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని చెప్పిన నాయకులు ఇప్పుడు కనివించడంలేదు. రాష్ట్రం అంతటా పెట్రోల్ బంకుల వద్ద ‘నో స్టాక్’ బోర్డులు కనిపించడం బాధాకరం” అని ఆయన అన్నారు. ఎండ తీవ్రత మధ్య ప్రజలను కిలోమీటర్ల మేర బంకుల వద్ద నిలబెట్టడం, ఇంధనం అందక ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడడం కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని మున్నీర్ విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని ఇంధన కొరత రాష్ట్రంలో ఎందుకు ఏర్పడిందో ప్రభుత్వాలు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో డీజిల్, పెట్రోల్ సంక్షోభానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే పూర్తి బాధ్యత వహించాలని ఆయన పేర్కొన్నారు. వెంటనే ఆయిల్ సరఫరాను పునరుద్ధరించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, ఇంధన కొరత కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని మున్నీర్ సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని ఇంధన సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఎక్కడ చూసినా పెట్రోల్, డీజల్ కొరత

**- ప్రజాజీవనం స్తంభించిపోయింది : డా.తులసిరెడ్డి**



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: ఓ వైపు ప్రభుత్వం పెట్రోల్, డీజల్ కొరత లేదని చెబుతున్నా, మరోవైపు ఎక్కడ చూసినా పెట్రోల్, డీజల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నట్లు ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా. తులసిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని, ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా జీవనం స్తంభించిపోయిందని మండిపడ్డారు. సరకు రవాణా నిలిచి పోయిందని, వ్యవసాయ రంగానికి కావాల్సిన డీజల్ లభించడం లేదన్నారు. ఆయిల్ కంపెనీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కైనట్లు స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. పశ్చిమ బెంగాల్ రెండో దశ ఎన్నికలు పూర్తైనా వెంటనే పెట్రోల్, డీజల్ ధరలు పెంచేలా కనిపిస్తోందన్నారు.

# మహిళా బిల్లును అడ్డుకోవడం ఎవరి తరం కాదు..

అమలాపురం,(ప్రజా సీమ) : మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న విపక్షాలకు వ్యతిరేకంగా అమలాపురం పట్టణంలో మహిళ లు నిర్వహించిన భారీ ర్యాలీ జన ఆక్రోశ మహిళా సమ్మేళన కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో సత్యనారాయణ హాజరైన ఎంపీ గంటి హరీష్ బాలయోగి,ఎమ్మెల్యేలు స్థానిక శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు,గిడ్డి సత్య నారాయణ,బండారు సత్యానందరావు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమ,మహిళా నాయ కురాలు ముళ్లపూడి రేణుక, గొల్లపల్లి అమూల్య,చిల్లా జగదీశ్వరి,చిక్కం సంధ్యారాణి పాల్గొన్న ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మిత్ర పక్షాలు ప్రధానమంత్రి మోడీ ప్రవేశపెట్టిన బిల్లును ఆమోదం కాకుండా అడ్డుకున్నారని మండి పడ్డారు రాబోయే రోజుల్లో మరల మోదీ నాయకత్వంలో అదే బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంద ని ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు.

# గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

## - మండల తాసిల్దార్ కు వినతి



సిద్ధవటం ప్రజా సీమ :గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలని మండల తాసిల్దార్ కు శ్రీ లక్ష్మీ ప్రసన్న గోశాల ట్రస్టు తరుపున వినతిపత్రం సమర్పించారు మండల కేంద్రమైన సిద్ధవటం తాసిల్దార్ కు సోమవారం శ్రీలక్ష్మి నరసింహ గోశాల ట్రస్టు తరుపున వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా గోశాల ట్రస్ట్ చైర్మన్ నరసింహస్వామి మాట్లాడుతూ గోమాతను జాతీయ గోవుగా ప్రకటించాలని వినతి పత్రం సమర్పించామని రాష్ట్రస్థాయిలో అన్ని మండలాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో గోశాల ట్రస్ట్ సభ్యులు వెంకట రమణారెడ్డి, గంజి సుబ్బరాయుడు, రోశయ్య, రమణారెడ్డి, శివ బాలరాజు, రాము తదితరులు పాల్గొన్నారు

# పంతగాని పెళ్లి రోజు సందర్భంగా అన్న క్యాంటీన్లో అన్నదానం






రైల్వేకోడూరు (ప్రజా సీమ) రాష్ట్ర టిడిపి సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్, డాక్టర్ నీలిమ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రైల్వేకోడూరు లోని అన్న కాంటీన్ నందు రోజు ఉదయం, మధ్యాహ్నం కలిపి 1000 మందికి ఉచిత భోజనం పెట్టడం జరిగింది. మరియు గవర్నమెంట్ హాస్పిటల్ లో రోగులకు పండ్లు బ్రేడ్ పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాజాల హేమారాజ్ పోతురాజు సుమన్ రాయుడు అమర శంకరయ్య మల్లెం హేమంత్ పంతగాని టీమ్ పాల్గొన్నారు.

# ఉచిత వడుగులు (ఖత్నా) కార్యక్రమం

## - రాష్ట్ర స్టేట్ డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు






సిద్ధవటం ప్రజా సీమ : కడప జిల్లా నూర్ భాషా దూదేకుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం జిల్లా దూదేకుల భవనం నందు ఉచిత వడుగుల కార్యక్రమం నిర్వహించడం జరిగిందని రాష్ట్ర నూర్ భాషా దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ నాగూర్ వీరభద్రుడు ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగింది వారు మాట్లాడుతూ పేద ముస్లిం, నూర్ భాషా, పిల్లలందరికీ ఈ ఉచిత వడుగుల కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని వారు తెలియజేశారు అలాగే వడుగులు చేయించుకున్న పిల్లలకు ఉచితంగా పాలు, బ్రెడ్, మదర దుస్తులు, ఐదు కేజీల గోధుమపిండి, నెయ్యి, మందులు, ఉచితంగా అందజేయడం జరిగిందని వారు తెలియజేశారు

# కలకడలో ఇండియన్ పెట్రోల్ బంక్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన అన్నమయ్య జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ






కలకడ(ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కలకడ మండలంలో ఉన్న ఇండియన్ పెట్రోల్ బంక్‌ను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, మరియు జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా పెట్రోల్ బంక్‌లో ఉన్న పెట్రోల్, డీజిల్ నిల్వలను అధికారులు పరిశీలించారు. జిల్లాలో ఇంధన కొరత ఎలాంటి సమస్య లేదని, తగినంత నిల్వలు ఉన్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి అపోహలు నమ్మవద్దని ఆయన సూచించారు. రైతులకు ప్రాధాన్యత ఇచ్చి ఇంధనం సరఫరా చేయాలని పెట్రోల్ బంక్ నిర్వాహకులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్. మహేశ్వరి బాయి, సీఐ, ఎస్సైతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు జిల్లా ఏర్పాటు చేయండి

## గూడూరు జిల్లా పోరాట సమితికన్వీనర్ కంకణాల పెంచల నాయుడు

గూడూరు,(ప్రజా సీమ) **ఏప్రిల్ 27 :** గూడూరు కేంద్ర శీ గా జిల్లా ఏర్పాటుచేయాలని గూడూరు జిల్లా పోరాట సమితికన్వీనర్ కంకణాల పెంచల నాయుడుఅన్నారు .అయన నాయకత్వం లో గూడూరు కేంద్రంగా 16 మండలాల తో కలిపి జిల్లా చేయాలని గత 147 రోజులుగా గూడూరు లోని గాంధీ బొమ్మ సెంటర్ లో ఏర్పాటు చేసిన శిబిరంలో దీక్ష చేస్తున్నారు.

# సమాజ సేవకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి

## - టిడిపి సీనియర్ నేత రాటకొండ బాబు రెడ్డి పిలుపు



మదనపల్లె (ప్రజా సీమ) : స్థానిక చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలో అడ్వకేట్ సురేష్ బాబు నాయుడు కుమారుడు షణ్ముగ సిద్ధ నాయుడు పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా చిన్నారులు,వృద్ధులకు అన్న వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రాటకొండ బాబు రెడ్డి ఆయన తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి వారి అనుచరులు హాజరై పిల్లలకు స్వయంగా అన్నం వడ్డించి,సంస్థ చేస్తున్న సేవలు చాలా అమోఘమని కొనియాడారు. ఒక రోజుకు సగటున 6000 మందికి పైగా ఆకలి బాధలతో చనిపోతున్నారని,నిరాదరణకు గురైన వారందరినీ అక్కున చేర్చుకొని కాపాడుతున్న చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు శ్లఘనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు,సానుభూతిపరులు అనుచరులు సహచరులు పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షులు యం.పి.ఆనందన్ తో కలిసి సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ డాక్టర్ జీవీయస్ బాబు,జనరల్ సెక్రటరీ కవితా రాణి సంస్థ కోశాధికారి పట్నం గిరిజమ్మాల్,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణచరణ్ మరియు ఆనంద వృద్ధాశ్రమం సిబ్బంది,తదితరులు పాల్గొని జ్ఞాపిక అందజేశారు.

# సాఫ్ట్ బాల్ క్రీడకు అన్ని విధాలా సహకరిస్తా

## - శాప్ చైర్మన్ రవి నాయుడు






ఏపీ బ్యూరో, (ప్రజా సీమ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాఫ్ట్బాల్ క్రీడకు అన్ని విధాలా సహకరిస్తానని శాప్ చైర్మన్ అనిమి రవి నాయుడు భరోసా ఇచ్చారు. సోమవారం విజయవాడలోని శాప్ కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2026 మే 9వ తేదీ నుంచి విశాఖపట్నం భీమిలిలో నిర్వహించబడనున్న ఇంటర్ జోనల్ సాఫ్ట్ బాల్ నేషనల్ టోర్నమెంట్ కు ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు శాప్ చైర్మన్ రవి నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిసి ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా భీమిలిలో జరిగే నేషనల్ టోర్నమెంట్ ను ఘనంగా నిర్వహిస్తున్నామని, శాప్ తరుపున అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని సాఫ్ట్బాల్ అసోసియేషన్ ప్రతినిధులు పేరు మీద కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాఫ్ట్బాల్ క్రీడకు అన్ని విధాల సహకరిస్తామని, భవిష్యత్తులో క్రీడాకారుల బంగారు భవిష్యత్తు కోసం ఈ క్రీడను మరింతగా ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కృషి చేయాలని, అందుకు కావలసిన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# కోమటివానిచెరువు రోడ్డు మరమ్మత్తులు చేపట్టండి మహాప్రభో

## - గుంతలను పూడ్చి నిరసన తెలిపిన బీవైఎస్ నాయకులు



మదనపల్లె (ప్రజా సీమ) : జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న కోమిటివాని చెరువు రోడ్డు అధ్వాన్న స్థితిని నిరసిస్తూ, బహుజన యువసేన ఆధ్వర్యంలో సోమవారం రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. గత కొన్ని నెలలుగా ఈ రోడ్డు గుంతలమయమై వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో,యువసేన కార్యకర్తలే స్వయంగా సిమెంట్,ఇసుక మరియు కాంక్రీటుతో గుంతలను పూడ్చి రోడ్డును తాత్కాలికంగా బాగు చేశారు. ఈ సందర్భంగా బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ కుమార్ మాట్లాడుతూ కోమిటివాని చెరువు రోడ్డు గత కొన్ని నెలలుగా పూర్తిగా పాడైపోయిందని,ఈ విషయంపై అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా కనీస స్పందన లేదని,అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం ఇదే రోడ్డుపై ఉన్న గుంతలను ఇసుకతో పూడ్చి వినూత్న రీతిలో నిరసన తెలిపామన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరినా పాలకులు,అధికారులు మొద్దు నిద్ర వీడల,ఎవరూ స్పందించకపోవడంతో మేమే పూనుకొని సిమెంట్ మరియు కాంక్రీటుతో ఈ గుంతలను పూడ్చామని వెల్లడించారు. ఇకనైనా అధికారులు స్పందించి ఈ రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేయాలని,ఇటీవలే జిల్లా కలెక్టర్ మరియు ఎమ్మెల్యే ఈ రోడ్డు మార్గంలోనే కార్యక్రమాలు నిర్వహించారని,రోడ్డు పక్కనే వెళ్తున్నా,గుంతలను చూసి కూడా చూడనట్లు వ్యవహరించడం శోచనీయమన్నారు. తక్షణమే ఈ రోడ్డుపై పూర్తిస్థాయి బీటీ పనులు చేపట్టాలని,?చెరువు పక్కన ఉన్న ప్రమాదకరమైన మలుపుల వద్ద విరిగిపోయిన సేఫ్టీ రాడ్లను వెంటనే పునరుద్ధరించాలన్నారు.?ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు.?ఈ కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెట్రోల్ కొరత పై వదంతులు నమ్మవద్దు

## - బ్లాక్ లో అమ్మే వారిపై ప్రత్యేక నిఘా

## -తిరుపతి జిల్లా కలెక్టర్, వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బారాయుడు





చిట్వేలి (ప్రజా సీమ) : చిట్వేలి మండలంలో పెట్రోల్, డీజిల్, కొరత ఉందని బంకుల వద్ద క్యూ కడుతున్న వాహనాలకు ఇటు మధ్యకాలంలో ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి వాహనదారులకు ఏర్పడింది. పెద్ద పెద్ద క్యాన్లలో తీసుకు వెళ్లకుండా వాహనాన్ని బంకుల వద్దకు తీసుకువచ్చి పట్టుకోవాలని సూచనలిస్తున్న కానీ సోషల్ మీడియాలో పెట్రోల్ డీజిల్ కొరతపై వదంతులు నమ్మవద్దని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పి సుబ్బారాయుడు, తిరుపతి జిల్లా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు. సోమవారం, జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ డీజిల్, సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని వారు సంకేతాలు ఇస్తున్నారు. అక్కడక్కడ పెట్రోల్ డీజిల్ సరైన సమయానికి ఆ బంక్ కు రాక ఇబ్బందులు పడుతున్నారని వాటిని కూడా ఇబ్బంది లేకుండా చూస్తామని ఉన్నత స్థాయి అధికారులే తెలియచేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిట్వేలి లో బ్లాక్ లో పెట్రోల్ 140 రూపాయల కమ్ముతున్నట్లు డీజిల్ 120 రూపాయలకు అమ్ముతున్నట్లు పుకార్లు షికార్లు లేపుతున్నాయి. అలా జరిగి ఉంటే అధికారులు అరికట్టే వారే కదా పెట్రోల్ బంక్ యజమానులు సరైన సమయానికి డివిజన్ పెట్రోల్ తెప్పించుకునే విషయంలో వారు డిడి తీసుకొని సంబంధిత ఆయిల్ సమస్త వారికి చెల్లిస్తే వారు చమురు పంపించే ప్రక్రియ కొనసాగుతుంది. కానీ ఇటు మధ్యకాలంలో చిట్వేలి లో పెట్రోల్ బంకుల్లో భారీ క్యాన్లు తీసుకువెళ్లి నింపుకుంటున్నారని మీ వాహనాన్ని తీసుకువచ్చి పెట్రోల్ డీజిల్ పట్టించుకోవాలని పెట్రోల్ బంకుల యజమానులు చెబుతున్నారు. జిల్లాస్థాయి అధికారులు మాత్రం రాష్ట్రవ్యాప్తంగా కూడా డీజిల్ పెట్రోల్ సమస్య లేదని ప్రజల్లోకి వచ్చి వారే స్వయంగా చెప్పే పరిస్థితి ఉన్న సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాలను నమ్మవద్దని తిరుపతి జిల్లా ఉన్నత స్థాయి అధికారులే ప్రజలకు చెబుతున్నారు. ఈ విషయాన్ని కూడా చిట్వేలి మండలంలో ఉండే పెట్రోల్ బంక్ యజమానులు నియమ నిబంధనలు పాటిస్తూ ప్రజలకు డీజిల్ పెట్రోల్ అందించేందుకు కృషి చేస్తామని తెలియజేస్తున్నారు. ఎక్కడే కానీ కొరత లేదని ఒక వైపు చెబుతున్న బ్లాక్లో అమ్ముతున్న వారిపై ప్రత్యేక నికాకురా ఏర్పాటు చేశామని అధికారులు అంటున్నారు.

# రెండు రోజుల్లో పూర్తి గా అందుబాటులోకి పెట్రోల్, డీజిల్


## - వరి యంత్రాలకు డీజిల్ కూపన్లు

## - నిల్వ చేస్తే కఠిన చర్యలు - కలెక్టర్ హరేంద్ర ప్రసాద్




కాకినాడ,(ప్రజా సీమ) : కాకినాడ జిల్లాలో బంకులలో పెట్రోల్,డీజిల్ రెండు రోజుల్లో తగు స్థాయిలో అందుబాటులోకి వస్తుందని అందువల్ల వాహనదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధర ప్రసాద్ పేర్కొన్నారు.అలాగే వరి కోతలు యంత్రాలకు ప్రత్యేకం గా రోజుకు సుమారు 70 లీటర్ల డీజిల్ కూపన్లను అందిస్తామని, పెట్రోల్ డీజిల్ నిల్వచేసిన లూజు విక్రయాలు చేసినా వారిపై కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ హెచ్చ రించారు.పెట్రోల్, డీజిల్ కొరతపై వాహనదారుల ఇబ్బందులను గుర్తించి జిల్లా కలెక్టరేట్లోని వివేకా నంద సమావేశం హాలులో జిల్లా పోలీస్ అధికారి జి.బిందు మాధవ్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్.ఎస్.ఎస్. సత్యనారాయణ రాజులతో కలిసి విలేకరులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధి ర ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల్లో ఉన్న భయం వల్ల బంకులకు వాహనదారులు వస్తున్నారని, ఆయిల్ కంపెనీలు ధరలు పెంచు తారని అపోహలతో బంకులకు వస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గతంతో పోల్చుకుంటే ఈ రెండు రోజుల్లో సుమారు 50 నుండి 60 శాతం విక్రయాలు పెరిగాయని రోజుకు 400 కిలో లీటర్ డీజిల్, 300 కిలో లీటర్లు పెట్రోల్ వినియో గం అవుతుందన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో 600 కిలోలీటర్ల డీజి ల్,470 కిలో లీటర్లు పెట్రోల్ అమ్మ డంతో బంకుల్లో కొరత ఏర్పడినట్లు చెప్పారు.వరి కోతలకు సంబంధిం చి యంత్రాల యజమానులకు రోజుకు 70 లీటర్ల డీజిల్ కూపన్లు ను గ్రామ వ్యవసాయ శాఖ అధి కారి,తహశీల్దారుల సహకారంలతో ఇవ్వనున్నట్లు వెల్లడించారు.ఆందోళ న చెంది అనవసరంగా, అవసరం లేని వారు బంకుల వద్దకు రావద్దని కలెక్టర్ సూచించారు.కాకినాడ జిల్లాలో ఉన్న 160 బంకుల్లో సుమారు 15 వరకు పూర్తిస్థాయి లో పనిచేయకపోవడంతో ప్రజల్లో ఆందోళన పెరిగినట్లు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు.

# అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఎంపీ హరీష్ బాలయోగి



కొత్తపేట,(ప్రజా సీమ): డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట గ్రామంలో జరిగిన బాబా సాహెబ్ అంబేద్కర్ జయం తి వేడుకలలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి,ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ వారి సేవలను ఈ సందర్భంగా గుర్తుచేస్తూ యువత అంబే ద్కర్ ఆశయాలను అవలంబిస్తూ ముందుకు దూసుకుపోవాలని మద్యానికి బానిసలు కాకుండా ప్రతి ఒక్కరూ విద్యనభ్యసించాలని కొనియాడారు.

# చట్టసభల్లో 33% రిజర్వేషన్ కోసం రాజీలేని పోరాటం

## - అమలాపురంలో గర్జించిన మహిళా శక్తి

## - పార్లమెంట్‌లో మహిళా బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్ కుట్రలపై ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ధ్వజం





అమలాపురం,(ప్రజా సీమ) :మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుని మహిళా లోకానికి కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేసిందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మండిపడ్డారు.సోమవారం అమ లాపురం పట్టణంలో మహిళలు నిర్వహించిన భారీ ర్యాలీ జన ఆక్రోశ మహిళా సమ్మేళనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ ర్యాలీ పట్టణంలోని మెట్ల రమణబాబు స్వగృహం నుండి ప్రారంభమై స్థానిక గడియార స్తంభం వరకు సాగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మహిళల సంక్షేమాన్ని కోరుకోలేదని, పార్ల మెంట్‌లో బిల్లును ఓడించడం ద్వారా వారి అసలు స్వరూపం బయటపడిందని విమర్శించారు. మహిళలకు తండ్రి ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావు కే దక్కుతుందని ఆయనగుర్తుచేశారు .స్థానిక సంస్థల్లో మహిళలకు మొదట 33 శాతం,ఆ తర్వాత 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదని,ఇది నారా చంద్రబాబు నాయుడు దార్శనికతకు నిదర్శనమని కొనియాడారు.డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి,వారిలో ఆత్మ విశ్వాసం నింపిన గొప్ప నాయకు డు చంద్రబాబని ఆయన పేర్కొ న్నారు.

ప్రధాని మోదీ,చంద్రబాబు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఎన్.డి.ఏ కూటమి మహిళల కు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు దక్కే వరకు, మహిళా బిల్లు ఆమోదం పొందే వరకు ఈ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు.ప్రతి గ్రామంలో వీధిలో మహిళా బిల్లు ప్రాముఖ్యతను చాటిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వందలాది మంది మహిళలు పాల్గొని,విపక్షాల తీరుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.

# డ్రైనేజీ నిర్మాణ పనులపై అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే.



పి.గన్నవరం, (ప్రజా సీమ) : పి.గన్నవరం కేంద్రంలో సుమారు రూ.70 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులపై పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ అసహనం వ్యక్తం చేశారు.కూటమి నాయకులతో కలిసి డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించిన ఎమ్మెల్యే, పనుల నాణ్యత అమలు విధానం పై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అధికారులు ఇచ్చిన వివరణపై ఆయన సంతృప్తి చెందలేదు.ఎమ్మెల్యే మాట్లాడు తూ,హెడ్ క్వార్టర్ ప్రాంతంలో నివసించే ప్రజలందరికీ ఆమోద యోగ్యంగా,దీర్ఘకాల ప్రయోజనా లను దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని స్పష్టం చేశారు.పనుల్లో ఎటువంటి నిర్ల క్ష్యం సహించబోమని హెచ్చరిం చారు.అదేవిధంగా,త్వరలోనే సంబంధిత అధికారులను కాంట్రాక్ట ర్‌ను పిలిచి సమీక్ష సమావేశం నిర్వహించి,పనుల నాణ్యతపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,స్థానిక ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా వేదికలో ప్రజల వద్ద నుండి 195 ఆర్జీలు






అమలాపురం,(ప్రజా సీమ) :అర్జీలను నాణ్యతతో పాటు నిర్దేశి త సమయానికి పరిష్కార మార్గా లు చూపాలని ప్రజా వేదికలో అందిన అర్జీలను జవా బుదారీత నంతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఆర్డిఓ జి మమ్మీ,డి ఆర్ డి ఎ పి డి రాంబాబు, ఎస్ డి సి. పి కృష్ణమూర్తి, డిఎల్డిఓలు అర్జీ దారుల నుండి సుమారుగా 195 అర్జీలను స్వీకరించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ద్వారా అందుతున్న అర్జీల పరిష్కారంలో హేతుబద్ధత కలిగి ఉండాలని తెలిపారు.ఆర్జీల ను సమగ్రంగా పరిశీలించి,వాటికి తగిన పరిష్కార మార్గాలనుత్వరి తగతిన సకాలంలో చూపాలని అధికారులకు సూచించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శ కత,సమర్థత పాటించడం ఆత్యం త ముఖ్యమన్నారు.ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని,నిర్దిష్ట కాల పరిమితిలో పరిష్కరించేలా చర్య లు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు సకాలంలో సేవలుఅందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ఎంపీ ఉదయ్ చొరవతో దుబాయ్ నుంచి స్వదేశానికి చేరిన యువకుడు



కాకినాడ, (ప్రజా సీమ) :ఉపాధి నిమిత్తం దుబాయ్ కి వెళ్లి, అనారోగ్య సమస్యలతో స్వదేశాని కి వచ్చేందుకు ఇబ్బందులు ఎదు ర్కొంటున్న యువకుడికి కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అండగా నిలిచి సురక్షితంగా స్వదేశానికి రప్పించా రు.పెద్దాపురం మండలం దివిలి గ్రామానికి చెందిన పులిగే చిన సన్యాసిరావు కొన్నేళు క్రితం ఉపాధి కొరకు దుబాయ్ వెళ్ళాడు, అయితే ఇటీవల కాలంలో అనారో గ్యం బారిన పడడంతో తల్లిదండ్రు ల సూచనల మేరకు స్వగ్రామానికి వచ్చేందుకు ప్రయత్నాలు చేసిన ప్పటికీ తాజాగా గల్ఫ్ దేశాల్లో చోటు చేసుకున్న యుద్ధ వాతావర ణంతో తిరిగి వచ్చే మార్గంలేక దుబాయ్ లోనే చిక్కుకుపోయాడు, దీంతో సహాయం కోసం యువకుడి తల్లిదండ్రులు కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ను కలిసి పరిస్థితి విన్నవించడంతో వెంటనే స్పందిం చిన ఎంపీ ఉదయ్ దుబాయ్ లో భారత ఎంబసీ అధికారులతో సంప్రదింపులు జరపడంతో పాటు, ఢిల్లీలో విదేశాంగ శాఖ అధికారుల కు లేఖ రాయడంతో ప్రయత్నాలు ఫలించి ఇటీవల యువకుడు దుబాయ్ నుంచి క్షేమంగా స్వగ్రా మానికి చేరుకున్నాడు.ఈ సంద ర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కు కృతజ్ఞ తలు తెలిపారు.నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

# ఆరోగ్యం

## నీళ్లు ఎక్కువగా తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు కరిగిపోతాయా?



ప్రస్తుతం చాలామంది కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. అందులో కూడా కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడేవాళ్ల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అయితే కిడ్నీలో రాళ్లు ఉంటే అవి కరిగిపోవాలంటే ఎక్కువగా నీళ్లు తాగాలని డాక్టర్లు సిఫార్సు చేస్తుంటారు. అయితే ఇందులో ఎంత నిజం ఉంది? నీరు త్రాగడం వల్ల నిజంగానే మూత్రపిండాల్లో రాళ్ళు నిజంగా తొలగిపోతాయా? అయితే ఎన్ని లీటర్ల నీళ్లు తాగాలి? ఈ ప్రశ్నలకు సమాధానం ఇప్పుడు చూద్దాం.

నీరు త్రాగడం వల్ల కిడ్నీలో రాళ్ళు తొలగిపోతాయా? మూత్రపిండాల ప్రక్రియ సక్రమంగా పనిచేయడంలో నీరు ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని డాక్టర్లు చెబుతున్నారు. ఇది మలాన్ని పలుచన చేయడమే కాకుండా ఎటువంటి చికాకు లేకుండా సులభంగా బయటకు రావడానికి కూడా సహాయపడుతుంది. నీరు త్రాగడం ద్వారా ఖనిజాలు, లవణాలు మూత్రపిండాల లోపల రాళ్ల రూపంలో పేరుకుపోవు. నీటిని ఎక్కువ పరిమాణంలో తీసుకుంటే మూత్రపిండాల్లో రాళ్ల ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

**ఎన్ని లీటర్ల నీళ్లు తాగాలి**

ఎవరికైనా చిన్న కిడ్నీ రాయి అంటే 5 మిమీ కంటే తక్కువ రాయి కిడ్నీలో ఉంటే కొన్ని సందర్భాల్లో అది మూత్ర నాళం నుండి బయటకు వచ్చే ఛాన్స్ ఉంటుంది. ఎక్కువ నీరు త్రాగడం అంటే రోజుకు కనీసం 2.5-3 లీటర్లు లేదా 8 నుండి 12 గ్లాసుల నీళ్లు తాగితే ప్రేగు కదలికల ఫ్రీక్వెన్సీని పెంచుతుంది, ఇది చిన్న రాళ్లను బయటకు పంపడంలో సహాయపడుతుంది. అదే సమయంలో శరీరం హైడ్రేటెడ్ గా ఉంటే రాళ్ళు క్రమంగా చిన్నవి అవుతాయి. అయితే కిడ్నీలో రాయి మధ్యస్థం నుండి పెద్దది అంటే 5 మిమీ లేదా అంతకంటే పెద్దదిగా ఉంటే నీరు త్రాగటం వల్ల మాత్రమే అది కరిగిపోదు. పెద్ద రాళ్లకు..మందులు, షాక్ వేవ్ లిథోట్రిప్సీ లేదా ఆపరేషన్ అవసరం కావచ్చు. కిడ్నీలో రాళ్లు అనేది పెద్ద సమస్య కాబట్టి దీని గురించి తెలిస్తే ఆలస్యం చేయకుండా నిపుణులను సంప్రదించి తగిన చర్యలు చేపట్టడం ఉత్తమం.

## రాయలసీమ స్పెషల్ రెసిపి..

### 1000 ఏనుగుల బలం వస్తుంది,ఎలా చేసుకోవాలంటే

**రాయలసీమ అంటే ఎవరికైనా ముందుగా గుర్తుకొచ్చేది పదం పౌరుషం. రాయలసీమ వాళ్ల ఆ పౌరుషం గొడ్డుకారం నుంచే వస్తుందని చెబుతుంటారు. గొడ్డుకారం రాయలసీమ వంటకాలలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉంది. రాయలసీమకు చెందిన ప్రజలు ఈ గొడ్డు కారం తినేందుకు బాగా ఇష్టపడతారు. అందుకే అక్కడ ప్రతి ఒక్కరి ఇంట్లో ఏది ఉన్నా లేకున్నా గొడ్డు కారం మాత్రం తప్పక ఉంటుంది. ఈ కారం అన్నంలోకి, దోసెల్లోకి, ఇడ్లీలోకి,ఇతర టిఫిన్లలోకి చాలా బాగుంటుంది. గొడ్డు కారం తినడం వల్ల బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని డాక్టర్లు కూడా చెబుతుంటారు. అలాంటి గొడ్డుకారాన్ని రాయలసీమ స్టైల్ లో ఎలా చేసుకోవాలి,దీని తయారీకి కావాల్సిన పదార్థాలేంటో ఇక్కడ చూడండి.**

గొడ్డు కారం తయారీకి కావాల్సిన పదార్థాలు -ఎండుమిరపకాయలు-25 -ఉల్లిపాయలు- 2 -వెల్లుల్లి-12 రెబ్బలు -చింతపండు- నిమ్మపండు సైజు అంత -జీలకర్ర-1 టీస్పూన్ -ఆవాలు- 1/2 టీస్పూన్ -నూనె- 2 టేబుల్ స్పూన్లు -ఉప్ప -కరివేపాకు గొడ్డు కారం తయారీ విధానం -ముందుగా ఎండుమిర్చిని శుభ్రంగా కడిగి, వాటిని చిన్న ముక్కలుగా తుంచుకోవాలి. -ఉల్లిపాయలను కూడా చిన్నగా తరుగుకోవాలి. -వెల్లుల్లి రెబ్బలను పొట్టు తీసి వాటిని కూడా చిన్నగా తరుగుకోవాలి. -చింతపండును కొద్దిగా నీటిలో నానబెట్టాలి. -ఒక మిక్సీ జార్‌లో ఎండుమిర్చి, ఉల్లిపాయలు, వెల్లుల్లి, జీలకర్ర, ఆవాలు, ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. -గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. -నానబెట్టిన చింతపండును పిండి, దాని రసాన్ని కూడా మిశ్రమంలో కలపాలి. -స్టవ్ మీద ఒక పాన్ పెట్టి అందులో ఆయిల్ పోసి వేడి చేయాలి. -నూనె వేడెక్కిన తర్వాత కరివేపాకు వేసి వేయించాలి. -కరివేపాకు వేగిన తర్వాత గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని పాన్‌లో వేసి బాగా కలపాలి. -మిశ్రమాన్ని మీడియం మంట మీద 5-10 నిమిషాలు వేయించాలి. -కారం వేగిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసి దానిని చల్లారనివ్వాలి. అంతే గొడ్డు కారం రెడీ. ఫ్రిజ్‌లో 1-2 వారాల వరకు ఈ కారాన్ని నిల్వ చేసుకోవచ్చు. -మీరు కారంను మరింత రుచిగా చేయాలనుకుంటే, కొద్దిగా బెల్లం కూడా వేసుకోవచ్చు. -చల్లారిన తర్వాత కారాన్ని ఒక గాజు సీసాలో నిల్వ చేసుకోవాలి.





## ఈ పప్పుపై,మాంసాహారం కూడా పనికిరాదు



ఆకుకూరల్లో బచ్చలి కూర పోషకాలతో నిండి ఉన్న కూర. ఇది ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తుంది. ఇందులో ఐరన్, కాల్షియం, విటమిన్స్, యాంటీ యాక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఈ బచ్చలికూరతో పప్పు చేసుకుంటే ఆ రుచి అద్భుతంగా ఉంటుంది. అలాగే శరీరానికి కావాల్సిన పోషకాలు కూడా అందుతాయి. దీనిని ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

కావలసిన పదార్థాలు 1 కప్పు కందిపప్పు 2 కప్పుల సన్నగా తరిగిన బచ్చలికూర 1 ఉల్లిపాయ, సన్నగా తరిగినది 2 టమోటాలు, సన్నగా తరిగినవి 1/2 టీస్పూన్ పసుపు పొడి 1 టీస్పూన్ కారం పొడి 1/2 టీస్పూన్ ధనియాల పొడి 1/4 టీస్పూన్ జీలకర్ర పొడి రుచికి సరిపడా ఉప్పు.

2 టేబుల్ స్పూన్ల నూనె కొద్దిగా ఆవాలు కొద్దిగా జీలకర్ర 2 ఎండుమిర్చి కొద్దిగా కరివేపాకు.

తయారీ విధానం ముందుగా కందిపప్పును శుభ్రంగా కడిగి, కుక్కర్‌లో వేసి, 2 కప్పుల నీరు పోసి, 3-4 విజిల్స్ వచ్చే వరకు ఉడికించండి. ఆ తరువాత ఉడికిన పప్పును మెత్తగా చేసుకోవాలి.

ఇప్పుడు ఒక గిన్నెలో నూనె వేడి చేసి, ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి మరియు కరివేపాకు వేసి వేయించండి. ఆ తరువాత అందులో ఉల్లిపాయ వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించండి. అనంతరం అందులో టమాటోలు వేసి మెత్తగా అయ్యేవరకు వేయించుకోవాలి. తరువాత పసుపు పొడి, కారం పొడి, ధనియాల పొడి మరియు జీలకర్ర పొడి వేసి బాగా కలపండి. అనంతరం బచ్చలికూర వేసి కొద్దిసేపు వేయించండి. అలాగే ఉడికించిన పప్పు మరియు రుచికి సరిపడా ఉప్పు వేసి కలుపుకోవాలి. ఇప్పుడు 5 నిమిషాలు ఉడికించి, వేడి వేడిగా అన్నంతో వడ్డించుకుంటే ఎంతో రుచికరమైన బచ్చలికూర పప్పు సిద్ధమైనట్లే.

## అమెరికాలో చేపల పులుసును ఇలానే చేసుకుంటారు



చేపల పులుసు అంటే ప్రతి ఒక్కరికీ ఎంతో ఇష్టం ఉంటుంది. దీనిని ఒక్కొక్కరు ఒక్కో విధంగా చేసుకుంటారు. ఇందులో దట్టించే మసాలా, ఆ చేపల ముక్కలు నోట్లోకి వెళ్ళగానే ఆహా కమ్మని రుచి కోసం అందరూ తహతహలాడుతుంటారు. మన దగ్గర ఈ చేపల పులుసును చాలా సాధారణమైన పద్ధతిలో చేసేస్తారు. కానీ అమెరికాలో ఎలా చేసుకుంటారో తెలుసా? ఈ స్టోరీలో దాని గురించి వివరించాము, పూర్తిగా చదివి అమెరికాలో చేపల పులుసును ఎలా చేసుకుంటారో తెలుసుకొని మీరూ ట్రై చేయండి.

1 %ఎస్త్ర% చేప ముక్కలు (మీరు ఏ రకమైన చేపను అయినా ఉపయోగించవచ్చు, కానీ తెలుపు చేపలు బాగుంటాయి) 2 ఉల్లిపాయలు, సన్నగా తరిగినవి 2 టమోటాలు, సన్నగా తరిగినవి 1 అల్లం ముక్క, చిన్నగా తరిగినది 4 వెల్లుల్లి రెబ్బలు, చిన్నగా తరిగినవి 2 పచ్చిమిర్చి, చీలికలు 1/2 టీస్పూన్ పసుపు పొడి 1 టీస్పూన్ కారం పొడి 1 టీస్పూన్ ధనియాల పొడి 1/2 టీస్పూన్ జీలకర్ర పొడి 1/4 టీస్పూన్ మెంతుల పొడి కొద్దిగా చింతపండు పులుసు రుచికి సరిపడా ఉప్పు కొద్దిగా నూనె కొత్తిమీర, సన్నగా తరిగినది (గార్నిష్ కోసం) తయారీ విధానం చేప ముక్కలను శుభ్రంగా కడిగి, కొద్దిగా ఉప్పు మరియు పసుపు పొడి వేసి పక్కన పెట్టండి. ఒక గిన్నెలో నూనె వేడి చేసి, అందులోనే ఉల్లిపాయలు వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించండి. అలాగే అందులోనే అల్లం, వెల్లుల్లి మరియు పచ్చిమిర్చి వేసి కొద్దిసేపు వేయించండి.

ఆ తరువాత ఆ మిశ్రమంలో టమాటోలు వేసుకోవాలి. అవి మెత్తగా అయ్యే వరకు వాటిని బాగా వేయించుకోవాలి. అనంతరం పసుపు పొడి, కారం పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి మరియు మెంతుల పొడి వేసి బాగా కలపండి. కొద్దిసేపు ఉడికిన తరువాత అందులో చింతపండు పులుసు మరియు రుచికి సరిపడా ఉప్పు వేసి కలపండి. పులుసు బాగా మరిగి తెర్లిన తరువాత అందులో ముందుగా శుభ్రం చేసి పెట్టుకున్న చేప ముక్కలను వేసుకొని ఓ పది నిమిషాల పాటు బాగా ఉడికించుకోవాలి. అనంతరం పై నుంచి కొత్తిమీర చల్లుకుంటే ఎంత రుచికరమైన అమెరికా స్టైల్ చేపల పులుసు సిద్ధమైనట్లే.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# సినిమా న్యూస్



## రవితేజ కొత్త మూవీ టైటిల్.. ఊహించలేదు భయ్యా!




మాస్ మహారాజా రవితేజ ఫ్యాన్స్‌కు అదిరిపోయే న్యూస్! దాదాపు 9 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత దిల్ రాజు నిర్మాణంలో రవితేజ ఒక క్రేజీ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. విభిన్న చిత్రాల దర్శకుడు హసిత్ గోలి తెరకెక్కించబోయే ఈ సినిమాకు 'అక్కాయిలు బాగున్నారా?' అనే వెరైటీ టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. 'ఇరుముడి' షూటింగ్‌లో బిజీగా ఉన్న రవితేజ, ఈ కొత్త సినిమాతో పక్కా ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వడానికి రెడీ అవుతున్నారు. ఆ వివరాలు చూద్దాం.. మాస్ మహారాజా రవితేజ సినిమా అంటేనే ఎనర్జీకి కేరాఫ్ అడ్రస్. అయితే కొంతకాలంగా సరైన సక్సెస్ కోసం ఆయన ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే శ్రీవిష్ణుకు 'రాజ రాజ చోర' వంటి డిఫరెంట్ హిట్ ఇచ్చిన యంగ్ డైరెక్టర్ హసిత్ గోలి చెప్పిన కథకు రవితేజ ఫిదా అయ్యారట. వీరిద్దరి కాంబోలో రాబోతున్న ఈ సినిమా పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాకు సంబంధించి ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక టైటిల్ తెగ వైరల్ అవుతోంది. అదే 'అక్కాయిలు బాగున్నారా?'. వినడానికి చాలా సాఫ్ట్‌గా, వెరైటీగా ఉన్న ఈ టైటిల్ రవితేజ మార్క్ కామెడీకి దగ్గరగా ఉంటుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. సాధారణంగా మాస్ టైటిల్స్ పెట్టే రవితేజ, ఈసారి ఇలాంటి క్లాస్ టచ్ ఉన్న టైటిల్ వైపు మొగ్గు చూపడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఇక త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. టాలీవుడ్ అగ్ర నిర్మాత దిల్ రాజు, రవితేజ కాంబినేషన్‌లో సినిమా వచ్చి చాలా కాలమైంది. వీరిద్దరి కలయికలో గతంలో వచ్చిన 'భద్ర' వంటి సినిమాలు సూపర్ హిట్ అయ్యాయి. ఇప్పుడు మళ్ళీ 9 ఏళ్ల తర్వాత శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మించబోతున్నారు. ఇప్పటికే స్టోరీ డిస్కషన్స్ పూర్తయ్యాయని, ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని సమాచారం. దర్శకుడు హసిత్ గోలి తన సినిమాల్లో ఏదో ఒక కొత్తదనం చూపిస్తుంటారు. 'రాజ రాజ చోర'తో తన టాలెంట్ ఏంటో నిరూపించుకున్నారు. ఇప్పుడు రవితేజ వంటి స్టార్ హీరోని హ్యాండిల్ చేసే అవకాశం రావడంతో, ఆయన బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా ఒక హిలేరియస్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారట. రవితేజ ప్రస్తుతం శివ నిర్వాణ దర్శకత్వంలో 'ఇరుముడి' సినిమా చేస్తున్నారు.

## వయసు కేవలం సంఖ్యే.. 56లో ఫిట్‌నెస్‌తో అదరగొట్టిన



హాలీవుడ్ పాప్ స్టార్ జెన్నిఫర్ లోపెజ్ మరోసారి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. 56 ఏళ్ల వయసులో కూడా ఆమె తన పర్ఫెక్ట్ ఫిజిక్ మరియు సిక్స్ ప్యాక్ అబ్స్‌తో ఫిట్‌నెస్‌కు కొత్త అర్థం చెబుతున్నారు. జిమ్‌లో తీసుకున్న ఆమె లేటెస్ట్ మిర్రర్ సెల్ఫీలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వయసు పెరుగుతున్నా తన క్రేజ్ మరియు ఫిట్‌నెస్ ఏమాత్రం తగ్గలేదని, ఆమె తన క్రమశిక్షణతో మరోసారి నిరూపించారు. ఆ విశేషాలు చూద్దాం.. జెన్నిఫర్ లోపెజ్ సోషల్ మీడియాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలు చూసి నెటిజన్లు నోరెళ్లబెడుతున్నారు. ఈ వయసులో కూడా అంతటి బాడీని మెయింటైన్ చేయడం సామాన్యం కాదు. క్రాప్ టాప్ మరియు జిమ్ టైట్స్ ధరించిన ఆమె, తన కండలు తిరిగిన శరీరాన్ని ప్రదర్శించారు. ఈ ఫోటోకు పెద్దగా క్యాప్షన్లు కూడా పెట్టలేదు, కేవలం ఒక బైసెప్ ఎమోజీని పెట్టి తన పవర్ ఏంటో చూపించారు. కేవలం ఫిట్‌నెస్ మాత్రమే కాదు, స్టేజ్ పెర్ఫార్మెన్స్‌లోనూ ఆమె కింగ్ అనిపించుకున్నారు. తాజాగా జరిగిన ప్రసిద్ధ మ్యూజిక్ ఫెస్టివల్ 'కోచెల్లా'లో ఆమె మొదటిసారి పెర్ఫార్మ్ చేశారు. ఫ్రెంచ్ డీజే డేవిడ్ గ్వెట్టాతో కలిసి ఆమె చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. "నా హ్యాపీ ఎరా ప్రతి విషయాన్ని మళ్ళీ కొత్తగా రాస్తోంది" అంటూ తన ఆనందాన్ని ఫ్యాన్స్‌తో పంచుకున్నారు. చాలా కాలం తర్వాత జెన్నిఫర్ లోపెజ్ మళ్ళీ రొమాంటిక్ కామెడీ సినిమాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఆమె అప్పట్లో నటించిన 'మెయిడ్ ఇన్ మాన్హాటన్' వంటి చిత్రాలు ఎంత పెద్ద హిట్ అయ్యాయో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఆమె 'ఆఫీస్ రొమాన్స్' అనే కొత్త సినిమాతో మళ్ళీ ఆ మ్యాజిక్ రిపీట్ చేయడానికి సిద్ధమవుతున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆమె పెట్టిన పోస్టు ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటున్నాయి. ఆఫీస్ రొమాన్స్ విశేషాలు: జెన్నిఫర్ లోపెజ్ నటిస్తున్న ఈ కొత్త సినిమాకు ఓల్ పార్కర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో బ్రెట్ గోల్డ్‌స్టెయిన్, బెట్టీ గిల్పిన్ వంటి ప్రముఖ తారాగణం నటిస్తున్నారు. సోనీ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాపై హాలీవుడ్‌లో మంచి అంచనాలు ఉన్నాయి. కేవలం మ్యూజిక్ ఆల్బమ్స్ మాత్రమే కాకుండా, వెండితెరపై కూడా తన సత్తా చాటడానికి జెన్నిఫర్ రెడీ అయిపోయారు. జెన్నిఫర్ లోపెజ్ జీవితం చూస్తుంటే వయసు అనేది కేవలం మన మెదడులో ఉండే ఒక సంఖ్య మాత్రమే అనిపిస్తుంది. సరైన తిండి, క్రమం తప్పని వ్యాయామం ఉంటే 50 దాటిన తర్వాత కూడా 20 ఏళ్ల యువతిలా కనిపించవచ్చని ఆమె నిరూపిస్తున్నారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలకు ఆమె ఒక ఇన్స్పిరేషన్‌గా నిలుస్తున్నారు. మొత్తానికి జెన్నిఫర్ లోపెజ్ తన 'హ్యాపీ ఎరా'ను ఎంజాయ్ చేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తూనే ఉన్నారు!

## ట్రెండింగ్ లో సమంత 'బంగారం' ప్లాన్



సోషల్ మీడియాలో ఒక పాట వైరల్ అయితే సినిమా సగం జనాల్లోకి వెళ్ళిపోయినట్లే. ఇప్పుడు సమంత కూడా సరిగ్గా ఇదే ఫార్ములాను నమ్ముకుంది. తన కొత్త సినిమా ప్రమోషన్ల కోసం భారీ స్పీచ్‌లు, ఈవెంట్లు కాకుండా.. ఒకే ఒక్క పాటతో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌ను షేక్ చేస్తోంది. 'మా ఇంటి బంగారం' అంటూ వస్తున్న ఈ సినిమా చుట్టూ ఇప్పుడిప్పుడే పాజిటివ్ బజ్ మొదలవుతోంది. అయితే కేవలం పాటలతోనే థియేటర్లకు జనం వస్తారా? లేక లోపల కంటెంట్ కూడా అదే రేంజ్‌లో ఉందా? అనే చర్చ ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సినిమాలోని 'తస్సాదియ్యా' సాంగ్ ఇప్పుడు నెట్టింట ట్రెండ్ అవుతోంది. సంతోష్ నారాయణన్ మార్క్ బీట్స్‌కు తోడు, సమంత ఎనర్జీ తోడవ్వడంతో ఇప్పటికే 20 వేలకు పైగా రీల్స్ వచ్చాయి. ఈ సినిమాను మే 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి మేకర్స్ డేట్ ఫిక్స్ చేశారు. రీసెంట్‌గా వచ్చిన టీజర్ చూస్తుంటే, ఒక సాదాసీదా ఇల్లాలు తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి చేసే పోరాటమే ఈ 'మా ఇంటి బంగారం' అని అర్థమవుతోంది. ఈ సినిమాకు సమంత నిర్మాత కూడా. రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరుతో కలిసి తన సొంత బ్యానర్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్'పై ఈ రిస్క్ తీసుకున్నారు. స్టార్ హోదా ఉన్నా సరే, సొంతంగా డబ్బులు పెట్టి సినిమా తీయడం అంటే అది ఒక అగ్ని పరీక్షే. అందుకే ప్రమోషన్ల విషయంలో వెన్నెల కిషోర్ లాంటి వాళ్లతో ఫన్నీ వీడియోలు చేయిస్తూ ఆడియన్స్‌ను ఎంగేజ్ చేసే ప్రయత్నం చేస్తోంది. ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాకు పక్కా యాక్షన్ సీన్లను జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో గుల్షన్ దేవయ్య, శ్రీముఖి, గౌతమి వంటి నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'సిటాడెల్' తర్వాత సమంత నుంచి వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో ఆడియన్స్‌లో కూడా ఒక రకమైన అంచనాలు ఉన్నాయి. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, ఒక బాధ్యత గల గృహిణిగా ఆమె చేస్తున్న ఈ యాక్షన్ అటెంప్ట్ ఎంతవరకు సక్సెస్ అవుతుందో చూడాలి. సమ్మర్ సీజన్ కాబట్టి ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు వచ్చే ఛాన్స్ ఎక్కువగా ఉంది. సాంకేతికంగా సంతోష్ నారాయణన్ మ్యూజిక్ సినిమాకు పెద్ద బలం. ఇప్పటికే పాటలతో బజ్ క్రియేట్ చేయడంలో టీమ్ సక్సెస్ అయ్యింది. అయితే ఇదే ఊపు సినిమా రిలీజ్ వరకు కొనసాగుతుందా అన్నది చూడాలి. బాక్సాఫీస్ దగ్గర నిలబడాలంటే కేవలం సాంగ్స్ వైరల్ అయితే సరిపోదు, సినిమాలో ఎమోషన్ పక్కాగా పండాలి. ఇక మే 15న ఈ 'బంగారం' బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తుందో మరికొద్ది రోజుల్లోనే తేలిపోనుంది.

## వారణాసి తర్వాత మహేష్ ప్లాన్ అదే!

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కెరీర్‌లో కీలక మలుపు తిరిగే ప్రాజెక్ట్‌గా వారణాసి నిలవబోతోందనే అంచనాలు ఇండస్ట్రీలో బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు పూర్తి స్థాయి పాన్ ఇండియా మార్కెట్‌ను టార్గెట్ చేయని మహేష్, ఈ సినిమాతో తన ఇమేజ్‌ను నేషనల్ నుంచి గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లాలని చూస్తున్నారు. ముఖ్యంగా ఎ. ఎ. రాజమౌళి దర్శకత్వం ఈ ప్రాజెక్ట్‌కు భారీ క్రేజ్‌ను తెచ్చిపెడుతోంది. రాజమౌళి సినిమాలకు ఉన్న అంతర్జాతీయ గుర్తింపు దృష్ట్యా, వారణాసి మహేష్ బాబుకు కేవలం సినిమా కాకుండా ఒక కెరీర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్ట్‌గా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గుంటూరు కారం తర్వాత మూడేళ్ల గ్యాప్ అయితే ఈ జర్నీలో మహేష్ కెరీర్లో మూడేళ్ల గ్యాప్ వచ్చింది. గుంటూరు కారం తర్వాత మహేష్ నుంచి ఇంత పెద్ద గ్యాప్ తీసుకోవడం రిస్క్‌గా కనిపించినా, తర్వాత వస్తుంది రాజమౌళి సినిమా కాబట్టి అది తన మార్కెట్ ను, క్రేజ్ ను, ఫాలోయింగ్ ను పెంచుతుందే తప్పించి ఏ మాత్రం రిస్క్ అనుకోవడానికి లేదు. రాజమౌళి ప్రాజెక్ట్స్‌కు సహజంగానే ఎక్కువ సమయం పడుతుండటంతో, ఈ గ్యాప్‌ను ఫ్యాన్స్ కూడా అంగీకరిస్తున్నారు. అంతేకాదు, సినిమా రిలీజ్ అయ్యే సమయానికి ఈ వెయిటింగ్ పీరియడ్ మరింత ఎక్స్‌పెక్టేషన్స్‌ను పెంచే ఫ్యాక్టర్‌గా మారవచ్చు. ఇదిలా ఉంటే వారణాసి తర్వాత మహేష్ బాబు ప్లాన్స్ మరింత యాంబీషస్‌గా కనిపిస్తున్నాయి. మూడేళ్లలో మూడు సినిమాలు రిలీజ్ చేయాలనే టార్గెట్ తో ఆయన ముందుకెళ్తున్నట్టు టాక్. ఇది కేవలం బిజీ షెడ్యూల్ మాత్రమే కాకుండా, మార్కెట్‌ను నిరంతరం యాక్టివ్‌గా ఉంచే వ్యూహంగా భావిస్తున్నారు. వారణాసి తర్వాత మహేష్ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో ఓ ప్రాజెక్ట్, అలాగే ఏషియన్ సునీల్ తో మరో సినిమా చర్చల్లో ఉండటం గమనార్హం. ఒకేసారి పలు ప్రాజెక్టులను ప్లాన్ చేయడం ద్వారా గ్యాప్‌లను తగ్గించడమే కాకుండా, విభిన్న జానర్లతో ఆడియన్స్‌ను ఆకట్టుకోవాలని మహేష్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది.



అయితే ఈ ప్రాజెక్టులకు ఎవరు దర్శకత్వం వహిస్తారనేది ఇంకా ఫైనల్ కాకపోవడం ఆసక్తిని పెంచుతోంది. ఇక రెమ్యునరేషన్ అంశం కూడా ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. వారణాసి తర్వా త పెరిగే మార్కె ట్ ను దృష్టిలో ఉంచుకుని ఆయన భారీ పారితో షికం డిమాండ్ చేస్తున్నారనే వార్తలు వినిపిస్తు న్నాయి. వార ణాసి సక్సెస్ అయితే, ఆయన మార్కెట్ విలువ భారీగా పెరిగే అవకాశం ఉ ండటంతో, ఈ హైక్ నిర్మాతలపై బడ్జెట్ ప్రెజర్‌ను పెంచే అవకాశముంది. ఇదే సమయంలో, స్టార్ మార్కెట్ పెరిగితే రికవరీ కూడా అదే స్థాయిలో ఉండే అవకాశం ఉండటంతో, నిర్మాతలు కూడా ఈ రిస్క్‌ను అంగీకరించడానికి అవకాశాలున్నాయి. అయితే ఈ మొత్తం ప్లాన్‌లో అత్యంత కీలకమైంది రాజమౌళితో సినిమా చేసిన తర్వాత వచ్చే ప్రాజెక్టులపై భారీ అంచనాలు ఏర్పడటం సహజం. గతంలో పలువురు స్టార్ హీరోలు ఈ ప్రెజర్‌ను ఫేస్ చేసినప్పటికీ, వాళ్లలో ఎక్కువ మంది ఫ్లాపులనే ఎదుర్కొన్నారు.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma